విశాలాంధ్ర పుస్తక ప్రదర్శన సందర్శించిన డొక్కా

విశాలాంధ్ర-గుంటూరు : విశాలాంధ్ర బుక్ హౌస్ ఆధ్వర్యంలో గుంటూరు లాడ్జిసెంటర్‌లోని ఏఎల్ బీఈడీ కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన 23వ పుస్తక మహోత్సవం(పుస్తక ప్రదర్శన)ను మాజీ మంత్రి డొక్కా మాణిక్యవరప్రసాద్ గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ప్రదర్శనలో ఏర్పాటు చేసిన వివిధ రచయితల పుస్తకాలను డొక్కా మాణిక్యవరప్రసాద్ తిలకించారు.

ఆరోగ్యశ్రీ ట్రస్ట్ సీఈఓను కలిసిన అక్కులప్ప నాయక్

విశాలాంధ్ర-మంగళగిరి : మంగళగిరిలోని ఆరోగ్యశ్రీ ట్రస్ట్ సీఈఓగా నూతన బాధ్యతలు తీసుకున్న డీకే బాలాజీను గురు వారం వారి కార్యాలయంలో ట్రైబల్ స్టూడెంట్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు కె.అక్కులప్ప నాయక్ మర్యాదపూర్వకంగా కలిసి దుశ్శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుమూల గిరిజన గ్రామాల్లో, ఆదివాసి గూడెంలో, ఎస్సీ, ఎస్టీ కాలనీలో ఆరోగ్యశ్రీ సేవలను మెరుగుపరచాలని కోరారు.

అంగన్‌వాడీలపై ఆరోపణలు సరికాదు

విశాలాంధ్ర-తాడికొండ : అంగన్‌వాడీలపై విజయనగరం జిల్లా బొబ్బిలి ఎమ్మెల్యే చిన్న అప్పలనాయుడు చేసిన ఆరోపణలు సరికాదని అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు మండిపడ్డారు. తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ తాడికొండ పోలీస్ స్టేషన్ సమీపంలో అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు చేస్తున్న నిరాహార దీక్ష గురువారానికి మూడవ రోజుకు చేరింది. శాంతియుతంగా నిరసనలు తెలియజేస్తుంటే తమపై శాసనసభ్యులు ఎందుకు అక్కస్సు వెళ్లగక్కుతున్నారని ప్రశ్నించారు. ప్రభుత్వ మొండి వైఖరి విడనాడాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఎడ్లపల్లి గాంధీ రామ్మోహన్రావు, చింతల భాస్కరరావు పాల్గొన్నారు.

ఫ్లెక్సీల చించివేత కలకలం

విశాలాంధ్ర-మంగళగిరి : నగరపాలక సంస్థ పరిధిలోని వైసీపీ కార్యాలయం వద్ద దుండగులు ఫ్లెక్సీలను చించి రాళ్ళు విసిరారు. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. దీనిపై నగర అధ్యక్షులు దొంతిరెడ్డి వేమారెడ్డి స్పందిస్తూ నూతనంగా ప్రారంభోత్సవం చేసిన కార్యాలయం ముందు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను చించివేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గత మూడు, నాలుగు రోజులుగా ఫ్లెక్సీలను దుండగులు చించి వేస్తూ ఉన్నారని, ఏమైనా సమస్యలు ఉంటే మాట్లాడి పరిష్కరించుకోవాలి గాని ఇలాంటి ఆకతాయి చర్యలకు పాల్పడితే చూస్తూ ఊరుకునేది లేదని హెచ్చరించారు. కన్నెర్ర చేస్తే తట్టుకోలేరన్నారు. ఫ్రెండ్లీ పాలిటిక్స్ ఆదరించాలని ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడితే తీవ్ర పరిణామాలు చవిచూడాల్సి వస్తుందని తనదైన శైలిలో ఘాటుగా స్పందించారు. అనంతరం మంగళగిరి రూరల్ పోలీస్ స్టేషన్‌లో నాయకులు ఫిర్యాదు చేశారు. ఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించారు.

ముగిసిన వికసిత్ భారత్ సంకల్ప యాత్ర

విశాలాంధ్ర-ఫిరంగిపురం : మండలంలో ఈ నెల 6వ తేది నుంచి ప్రారంభమైన వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమాలు విజయవంతంగా ముగిశాయి. రాష్ట్రంలో పేద ప్రజల సంక్షేమం కోసం భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన 17 రకాల సంక్షేమాభివృద్ధి పథకాలపై మండలంలో ప్రచార యాత్ర ద్వారా ప్రతి గ్రామంలో ప్రజలకు అవగాహన కల్పించారు. మండలంలోని వివిధ శాఖలకు చెందిన అధికారులు పథకాల గురించి ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో భాగంగా చివరిగా మండలంలోని యరగుంట్లపాడు, తక్కెళ్లపాడు గ్రామాలలో జరిగిన కార్యక్రమాలకు బీజేపీ నాయకులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మండల అధికారులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణలు తొలగించాలి

విశాలాంధ్ర, తెనాలి : ఇళ్ళ యజమానులు షాపులవారు తమ ఇంటి ముందున్న మురుగు కాలువలపై ఆక్రమణలు తొలగించాలని వ్యర్థాలను బయట పారవేయ వద్దని వాటిని తమ మున్సిపల్ సిబ్బంది వచ్చినప్పుడు అందించాలని తెనాలి ఛైర్‌పర్సన్ తాడిబోయిన రాధికా రమేష్ అన్నారు. రోజువారీగా పారిశుద్ధ్య పనుల పర్యవేక్షణలో భాగంగా గురువారం 29వ వార్డులో డ్రైనేజ్ కాలువల పనితీరు చూసి పేరుకొన్న సిల్టు ఇతర వ్యర్థాలను తొలగింపజేసి మురుగునీరు సాఫీగా పారే విధం గా చేశారు. కౌన్సిలర్ రమావత్ కవితాబాయి, శానిటరి ఇన్‌స్పెక్టర్ అను పమ, సిబ్బంది, వైకాపా నాయకులు తాడిబోయిన రమేష్ పాల్గొన్నారు.

కులమత వర్గాలకతీతంగా గ్యార్మీ పండుగ

విశాలాంధ్ర, తెనాలి : పట్టణంలో హజ్రత్ మహబూబ్ సుభాని గ్యార్మి పండుగ కుల మత వర్గాలకతీతంగా జరుపుకోవటం అభినందనీయమని మాజీ ఎమ్మెల్యే ఆలపాటి రాజేంద్రప్రసాద్ అన్నారు. గురువారం బుర్రుపాలెం రోడ్డులోని జెండా సెంటర్‌లో గ్యార్మీ పురస్కరించుకొని అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గత 10 సంవత్సరాల నుండి నశీం ఇర్ఫాన్‌లు ఇటువంటి కార్యక్రమాలకు పిలిచి గౌరవం ఆపాదిస్తున్నారని వారికి ధన్యవాదాలు తెలుపుతూ ఇటువంటి ధార్మిక కార్యక్రమాలకు తమ ప్రభుత్వం అండగా వుంటుందన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ వెంకటేశ్వరరావు, ఖుద్దూస్, ఈదర వెంకట పూర్ణచంద్ తదితరులు పాల్గొన్నారు.

దూళిపాళ్లకు శుభాకాంక్షలు తెలిపిన నసీర్

విశాలాంధ్ర-గుంటూరు : సంగం డెయిరీ ఛైర్మన్, మాజీ శాసనసభ్యులు దూళిపాళ్ల నరేంద్ర కుమార్ జన్మదినం సందర్భంగా స్థానిక జేకేసీ కళాశాల రోడ్డులోని ఆయన స్వగృహంలో గుంటూరు తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జ్ మొహమ్మద్ నసీర్ గురువారం కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జాగర్లమూడి శ్రీనివాస్ రావు, కార్పొరేటర్లు ముప్పవరపు భారతి, యల్లవుల అశోక్, మల్లెంపూడి శ్రీనివాస్, గోళ్ళ ప్రభాకర్, బలరాం, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

హక్కులు సాధించేవరకు ఆందోళన చేస్తాం..

విశాలాంధ్ర-పొన్నూరు: న్యాయమైన హక్కులను ప్రభుత్వం నెరవేర్చేంత వరకు పోరాటం కొనసాగిస్తామని పొన్నూరు అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు అన్నారు. గురువారం పొన్నూరు పట్టణంలో 3వ రోజు నిరసన దీక్ష కొనసాగించారు. అంగన్వాడి దీక్షకు మద్దతుగా సిఐటియు (మంగళగిరి) నాయకుడు రమేష్‌తో పాటు జిల్లా తెలుగు మహిళ నాయకులు రమాదేవి, అనురాధ సంఘీభావం తెలిపారు. మండల సిఐటియు నాయకుడు నిమ్మకూరు రమేష్ పాల్గొన్నారు.

రైతులకు తక్షణమే నష్టపరిహారం ఇవ్వాలి: జంగాల

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: మిచౌంగ్ తుఫాన్, కరువు వలన దెబ్బతిన్న పొలాల రైతులకు తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం నష్టపరిహారం ఇవ్వాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, గుంటూరు జిల్లా కార్యదర్శి జంగాల అజయ్ కుమార్ డిమాండ్ చేశారు. సీపీఐ జిల్లా సమితి ఆధ్వర్యంలో నగర కార్యదర్శి కోట మాల్యాద్రి అధ్యక్షతన గురువారం స్థానిక కలెక్టర్ కార్యాలయం ఎదుట సీపీఐ శ్రేణులు, రైతు సంఘ నాయకులు, రైతులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జంగాల మాట్లా డుతూ రాష్ట్రంలో రైతుల పరిస్థితి అత్యంత దయనీయంగా ఉందన్నారు. తుఫాన్ కారణంగా రాష్ట్రంలో రైతులు లక్షలాది ఎకరాలలో పంట నష్టపోయారని అన్నారు. పంట నీటిపాలై కనీసం పంట కూడా చేతికి వచ్చే పరిస్థితి లేదన్నారు. వరి, అరటి, మొక్కజన్న, జొన్న, మిరప తదితర చేతికొచ్చిన పంటలు నష్టపోయి రైతులు తీవ్రంగా విలపిస్తున్నారని, ఆత్మహత్య తప్ప మరో మార్గం లేని పరిస్థితులలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పంట పండినా... పండకున్నా కౌలు రైతు కౌలు చెల్లించాలని, ఇప్పటికే ఒక్కొక్క పంటకు ఒక్కో రూపంలో వేలు, లక్షల్లో పెట్టుబడి పెట్టిన రైతులు నేడు దీనావస్థలో ఉన్నారని అన్నారు. సుమారు రూ.10వేల కోట్లకుపైగా నష్టం వాటిల్లిందన్నారు. ఇప్పటికే ఐదుగురు రైతులు ఆత్మహత్య చేసుకున్నారని, దుగ్గిరాలలో బసవపున్నయ్య అనే రైతు ఆరు ఎకరాలు కౌలు తీసుకుని వరి వేస్తే తుఫాన్ దాటికి పంట నీట మునిగిందని, ఏమి చేయాలో తెలీయక పొలంలోనే పురుగు మందు తాగి బలవ్మరణానికి పాల్పడిన ఘటన కలచివేసిందన్నారు. ఇంతా జరుగుతున్నా ప్రభుత్వం నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరించడం సమంజసం కాదన్నారు. తుఫాన్, కరువు నష్టాన్ని జాతీయ విపత్తుగా ప్రకటించి తక్షణ సాయంగా రూ.1000కోట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. నష్టపోయిన పంటలను గుర్తించి అక్రమాలకు తావివ్వకుండా నమోదు చేయాలని, కౌలు రైతులకు తగిన ప్రాధాన్యత ఇవ్వాలని, తక్షణమే కరువు మండలాలను గుర్తించాలని, నష్టపోయిన ఆహార పంటకు ఎకరాకు రూ.40 వేలు, వాణిజ్య పంటకు రూ.75 వేలు, ఉద్యాన పంటకు లక్ష రూపాయలు వర్తింపజేయాలని, మొలకెత్తిన వరి ధాన్యాన్ని, పత్తి, మిర్చి పంటలను ప్రభుత్వం కొనాలని డిమాండ్ చేశారు. సీపీఐ నగర కార్యదర్శి కోట మాల్యాద్రి మాట్లాడుతూ రాష్ట్రంలో వర్షం లేని కారణంగా కరువు వచ్చి పంటలు నాశనం అవుతుంటే కరువు మండలాలను ప్రకటించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. ఈ ధర్నాకు టీడీపీ, జనసేన, సీపీఎం, తదితర రైతుసంఘాలు సంఘీభావం తెలిపారు. జిల్లా టీడీపీ అధ్యక్షులు తెనాలి శ్రావణ్ కుమార్, జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు గాదె వెంకటేశ్వరరావు, వివిధ రైతు సంఘాలు, ప్రజాసంఘాల నాయకులు ప్రసంగించారు. అనంతరం డీఆర్వో చంద్రశేఖర్‌రావుకి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీలు, రైతు సంఘాల నాయకులు వెలుగూరి రాధాకృష్ణమూర్తి, చిన్ని తిరుపతయ్య, పి.మాణిక్యాలరావు, పచ్చల శివాజీ, కంచుమాటి అజయ్‌కుమార్, సాంబశివరావు, యార్లగడ్డ వెంకటేశ్వరరావు, కాబోతు ఈశ్వరరావు, గుర్రంకొండ సత్యానందం, టి.లక్ష్మారెడ్డి, పుప్పాల సత్యనారాయణ, చల్లా చిన్నఆంజనేయులు, రావుల అంజిబాబు, కేతినేని అగస్టీన్, గని, ఆరేటి రామారావు, నాసర్ జీ, వలి, జంగాల చైతన్య, ఆదేశ్వరరావు, బండారపు శశి, నూతలపాటి చిన్న, మంగా శ్రీనివాసరావు, బందెల రవికుమార్, పాశం వెంకటేశ్, పిల్లి బాలశౌరి, మద్దిరాల కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

రౌడీషీటర్ల కదలికలపై నిఘా ఉంచాలి: ఎస్పీ

విశాలాంధ్ర-గుంటూరు : జిల్లాలోని ప్రతి పోలీస్‌స్టేషన్ పరిధిలో రౌడీషీటర్ల కదలికలపై నిఘా ఉంచాలని జిల్లా ఎస్పీ ఆరిఫ్ హఫీజ్ పోలీస్ అధికారులు, సిబ్బందికి సూచించారు. జైలు నుంచి విడుదలైన పాత నేరస్తులపై కూడా నిఘా ఉంచాలన్నారు. గుంటూరు పోలీసు కార్యాలయంలో ఉన్న కాన్ఫరెన్స్ హాలులో జిల్లా పోలీస్ అధికారులతో గురువారం నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న వివిధ కేసుల్లో ఎన్‌బీడబ్ల్యూలు సాధ్యమైనంత వరకు వారెంట్ ఎగ్జిక్యూట్ చేసి ముద్దాయిలకు శిక్ష పడేలా చేయాలన్నారు. జిల్లావ్యాప్తంగా ప్రతిరోజు ఉదయం, సాయంత్రం వేళల్లో కళాశాలలు, బస్టాండ్‌లు, రైల్వే స్టేషన్ తదితర ముఖ్యమైన ప్రాంతాల్లో పర్యటించి విజిబుల్ పోలీసింగ్ నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఎన్‌డీపీఎస్, ఎక్సైజ్ కేసులను త్వరగా ఫైనలైజ్ చేయాలని అధికారులను కోరారు. జగనన్నకు చెబుదాం ఫిర్యాదులకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని ఎస్పీ తెలిపారు. జిల్లాలో వివిధ పోలీసు స్టేషన్ల పరిధిలో నమోదైన ఎక్సైజ్ కేసులను 10 లీటర్ల లోపు పట్టుబడిన మద్యం కేసులకు సంబంధించి వారు జిల్లా ఎక్సైజ్ కమిషనర్ కార్యాలయంలో పరిష్కారం చేసుకొనే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. లాంగ్ పెండింగ్ కేసులను, 2020, 2021, 2022 ఈ సంవత్సరంలో ఇప్పటి వరకు జిల్లాలో నమోదైన కేసులకు సంబంధించిన పూర్తి వివరాలను అడిగి తెలుసుకొని సాధ్యమైనంత వరకు త్వరగా దర్యాప్తు పూర్తి చేయాలన్నారు. పోలీసు యంత్రాంగం విధి నిర్వహణలో నిజాయితీగా, నిక్కచ్చిగా ఎటువంటి అవినీతి ఆరోపణలకు తావు లేకుండా జవాబుదారితనంతో, క్రమశిక్షణతో వ్యవహరించాలని ఇందుకు భిన్నంగా వ్యవహరిస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. జిల్లాలో రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు డీజీపీ పంపిన సర్కులర్ ప్రకారం నడుచుకోవాలని, ఆ సర్కులర్ ప్రకారం నోడల్ అధికారిగా ట్రాఫిక్ డీఎస్పీ ఉంటారని అన్నారు. గంజాయి విక్రయాలను సమూలంగా అరికట్టడానికి పటిష్ట చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ సమావేశంలో అడ్మిన్ అడిషనల్ ఎస్పీ సుప్రజ, గుంటూరు క్రైమ్ అదనపు ఎస్పీ శ్రీనివాసరావు, సెబ్ అడిషనల్ ఎస్పీ మహేష్, సౌత్ సబ్ డివిజన్ డీఎస్పీ మహబూబ్ బాషా, తూళ్లూరు డీఎస్పీ పోతురాజు, వెస్ట్ డీఎస్పీ ఉమామహేశ్వర రెడ్డి, దిశా పోలీసు స్టేషన్ డీఎస్పీ రామారావు, డీసీఆర్‌బీ డీఎస్పీ శ్రీనివాస్ రావు, ఏఆర్ డీఎస్పీ చంద్రశేఖర్ రావు, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ బాలసుబ్రమణ్యం, స్పెషల్ బ్రాంచ్ సీఐ శ్రీనివాసరావు, ఆర్ఐలు రాజారావు, థామస్ రెడ్డి, సీసీఎస్ సీఐలు, జిల్లాలోని ఆయా స్టేషన్‌ల సీఐలు, ఎస్సైలు తదితరులు పాల్గొన్నారు.

డొక్కాను కలిసిన మహిళా విభాగం సభ్యులు

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : వైసీపీ మహిళా విభాగం రాష్ట్ర కమిటీ సభ్యులుగా నియమితులైన బండ్ల మూడి రోజారాణి, గుంటూరు శ్రీరెడ్డి, పెద్దిరెడ్డి సామ్రాజ్యం, దాసరి దరియాలు స్థానిక బృందావన్ గార్డెన్స్‌లో ఉన్న వైసీపీ జిల్లా, ప్రాంతీయ పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు డొక్కా మాణిక్యవర ప్రసాద్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా డొక్కా మాణిక్యవర ప్రసాద్ వారికి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నగర మహిళా అధ్యక్షురాలు గనిక ఝాన్సీ, రత్నకుమారి, శివ పార్వతి, వెంకాయమ్మ, ప్రసన్న పాల్గొన్నారు.

మోదీ, అమిత్‌షా రాజీనామా చేయాలి

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : లోక్‌సభలో భద్రతా వైఫల్యానికి బాధ్యత వహిస్తూ భారతదేశ ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా రాజీనామాలు చేయాలని రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు మేడా శ్రీనివాస్ గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. మూడంచెల భద్రతపై కళ్ళు కప్పి అగంతకులు ప్రవేశించటం వెనుక విద్రోహ కుట్ర దాగి ఉందని ఆయన ఆరోపించారు. లోక్‌సభలో అగంతకులు ప్రవేశించటంతో భారతదేశ ప్రతిష్ఠ మంట కలిసి పోయిందని ఆయన ఆవేదన వ్యక్తంచేశారు. దేశ ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాల అసమర్థతను కూడా వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో ప్రచార అస్త్రంగా మార్చుకుంటారా? అని ఆయన ప్రశ్నించారు. మోదీ, అమిత్ షా పాలనలో దేశానికి భద్రత లేకపోవడంతో పాటు మహిళలకు రక్షణ కూడా కరువైందని మేడా శ్రీనివాస్ ఆరోపించారు.

కన్నెర్ర చేస్తే తట్టుకోలేరు: వేమారెడ్డి

విశాలాంధ్ర-తాడేపల్లి: నేను కన్నెర్ర చేస్తే తట్టుకోలేరని వైసీపీ ఎంటీఎంసీ అధ్యక్షులు దొంతిరెడ్డి వేమారెడ్డి అన్నారు. వేమారెడ్డి ఆత్మకూరు బైపాస్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన వైసీపీ కార్యలయం వద్ద ఫ్లెక్సీలను చించివేయటం పై అగ్రహం వ్యక్తం చేశారు. గురువారం తాడేపల్లి బైపాస్ రోడ్డులోని క్రొమా కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఎవరికైనా సమస్య ఉంటే మాట్లాడాలి... పరిష్కరించుకోవాలి... అంతేగాని ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడితే సహించేది లేదని హెచ్చరించారు. ఫ్రెండ్లీ పాలిటిక్స్‌ను స్వాగతించాలి,ఆదరించాలి. అంతేగాని ఇలాంటి చౌకబారు పనులు మానుకోవాలని, ఇలాంటివి మరలా జరిగితే సంహించేదిలేదన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

విశాలాంధ్ర-మంగళగిరి: రామచంద్రాపురం గ్రామంలో గురువారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, ఇంఛార్జ్ గంజి చిరంజీవి ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా చిరంజీవి మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి రైతన్నల కోసం ఎంతగానో కృషి చేస్తున్నారని తెలిపారు. తుఫాను వచ్చిన పంట నష్టం జరగకుండా ముందు జాగ్రత్తలలో భాగంగా పంట కొనుగొలు విషయంలో అధికారులకు ప్రత్యేక సూచనలు చేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి, భీమిరెడ్డి సుధాకర్ రెడ్డి, డైరెక్టర్ కొల్లి రాంగోపాల్ రెడ్డి , సహాయ వ్యవసాయ సంచారకులు శ్రీనివాస్ రెడ్డి, వ్యవసాయ అధికారి శైలజ రాణి తదితరులు పాల్గొన్నారు.

సాంఘిక బహిష్కరణ బాధితులకు న్యాయం చేయాలి

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: సాంఘిక బహిష్కరణ బాధితులకు అన్యాయం చేస్తున్న గుంటూరు జిల్లా కలెక్టర్‌పై ఎస్సీ, ఎస్టీ చట్టం లోని సెక్షన్ 4 ప్రకారం చర్యలు తీసుకోవాలని పత్తిపాడు మండలం పెదగొట్టిపాడు సాంఘిక బహిష్కరణ బాధితులు ప్రభుత్వాన్ని కోరారు. గురువారం స్థానిక అంబేద్కర్ భవన ప్రాంగణంలో జరిగిన విలేకరుల సమావేశంలో పెదగొట్టిపాడు సాంఘిక బహిష్కరణ బాధితుల నాయకులు బోసి మౌనిక, సౌరమ్మలు మాట్లాడుతూ సాంఘిక బహిష్కరణ బాధితులకి జీవో నెంబర్ 90 ప్రకారం ఎఫ్ఐఆర్ నమోదైన దశలో 25శాతం నష్టపరిహారం ఇవ్వాల్సి ఉండగా ఆ విధంగా ఇవ్వకుండా తన చట్టపరమైన విధుల్ని కలెక్టర్ నిర్లక్ష్యం చేశారని, తత్ఫలితంగా బాధితులకు అందాల్సిన లక్షలాది రూపాయలు బాధితులకు అందకుండా పోయాయని, బాధితులకు న్యాయం చేయాలని కోరారు. ఎస్సీ, ఎస్టీ చట్టం ప్రకారం తీసుకోవాల్సిన చర్యలు నిర్లక్ష్యం చేస్తే సెక్షన్ నాలుగు ప్రకారం క్రిమినల్ చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని, అందుకని ప్రభుత్వం తక్షణమే కలెక్టర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పిల్లి ప్రభావతి, నంబూరు రోజు మేరీ, బత్తుల అలేఖ్య, దేవరపల్లి సువార్తమ్మ పాల్గొన్నారు.

అభ్యర్థుల వయోపరిమితి 44 ఏళ్లకు పెంచాలి

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: ప్రభుత్వ ఉద్యోగాలకు నోటిఫికేషన్ల జాప్యం వల్ల సుమారు 50,000 మందికి పైగా అభ్యర్థులు వయోపరిమితి కోల్పోయారని, అభ్యర్థుల వయోపరిమితిని 42 నుండి 44 సంవత్సరాలకు పెంచాలని గుంటూరు జిల్లా తెలుగుయువత అధ్యక్షులు రావిపాటి సాయి కృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం జిల్లా పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో సాయికృష్ణ మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఏటా జనవరిలో జాబ్ క్యాలెండర్ ఇస్తామని ప్రకటించి, నిరుద్యోగుల ఆశలపై నీళ్ళు చల్లారని, ఐదేళ్ళ పాలన పూర్తి కావస్తున్నా, డీఎస్సీ కానీ, గ్రూప్ 1, గ్రూప్ 2 పోస్టులు భర్తీ కానీ, ఆఖరికి పోలీస్ కానిస్టేబుళ్ళ పోస్టులు కూడా ఇవ్వలేక పోయారన్నారు. ఆడుదాం ఆంధ్ర పేరుతో యువత జీవితాలతో మరోసారి ఆటలాడేందుకే వైసీపీ కొత్త నాటకం అని, ఆ కార్యక్రమానికి కేటాయించిన రూ.12 కోట్లతో నోటిఫికేషన్ల జాప్యం వల్ల రాష్ట్రంలో వయోపరిమితి కోల్పోయిన నిరుద్యోగులకు నిరుద్యోభృతి ఇవ్వచ్చు లేకా గ్రంథాలయాలకు కొత్త పుస్తకాలు మౌలిక వసతులతో అభివృద్ధి చేయవచ్చని అన్నారు. కార్యక్రమంలో షేక్ నాగుల్ మీరా బాబు, గుత్తికండ కిరణ్, మన్నెం శ్రీనివాస్ రావు, షేక్ ఇమ్రాన్, మస్తాన్ రావన్ తదితరులు పాల్గున్నారు.

అంబేడ్కర్ విగ్రహానికి పాలాభిషేకం

విశాలాంధ్ర-పొన్నూరు : పట్టణంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి గురువారం రాష్ట్ర ఎస్సీ కమిషన్ ఛైర్మన్ మారుమూడి విక్టర్ ప్రసాద్ పాలాభిషేకం చేశారు. పలు కార్యక్రమాలలో భాగంగా జై భీమ్ కమిటీ సభ్యులు, అంబేద్కర్ సంఘాల సభ్యులతో కలిసి ఆయన పాలాభిషేకం నివాళులర్పించారు.

ఓటు వేయడం నైతిక బాధ్యత

విశాలాంధ్ర-తాడేపల్లి : ఓటు వేయడం పౌరుల నైతిక బాధ్యత అని గుంటూరు జిల్లా తెనాలి సబ్ కలెక్టర్ గీతాంజలిశర్మ అన్నారు. గురువారం కేఎల్ డీమ్డ్ యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన ఓటర్ల అవగాహనా సదస్సుకు ఆమె ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. విద్యార్థులకు ఓటు పట్ల అవగాహన కల్పించారు. విద్యార్థులు ఓటు అనే ఆంగ్ల అక్షరమాలతో పాటు అతిపెద్ద మానవహారాలుగా ఏర్పడి అందరినీ ఆకర్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రపంచంలోనే అతి పెద్ద ప్రజాస్వామ్య దేశంగా భారత్ ఉందన్నారు. రాజ్యాంగబద్ధంగా అధికారాన్ని చేపట్టే ప్రజాప్రతినిధులను ప్రతి ఒక్కరూ బాధ్యతగా తమ ఓటు ద్వారా ఎన్నుకుని తమ ప్రాంతం అభివృద్ధి చేసుకోవాలని పిలుపునిచ్చారు. అన్ని రకాల సవాళ్లను ఎదుర్కొని అధికార యంత్రాంగం ఎన్నికలు నిర్వహిస్తుంటే ఓటర్లు నిర్లక్ష్యం వహించడం తగదన్నారు. కేఎల్ యూనివర్సిటీలో చదువుతున్న విద్యార్థులు స్థానికంగా ఓటును నమోదు చేసుకుని చివరి సంవత్సరం పరీక్షలు పూర్తి అయ్యే వరకు ఇక్కడే ఓటును ఉపయోగించుకోవచ్చునని స్పష్టంచేశారు. తమ తల్లిదండ్రులకు కూడా ఓటు గురించి అవగాహన కల్పించాలని కోరారు. కేఎల్‌యూ రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు మాట్లాడుతూ ఎటువంటి ప్రలోభాలకు గురికాకుండా యువతీయువకులందరూ ఓటును తప్పనిసరిగా వినియోగించుకుని మంచి నాయకులను ప్రజాప్రతినిధులుగా ఎన్నుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గుంటూరు జిల్లా డిప్యూటీ కలెక్టర్ కె.స్వప్న, మంగళగిరి నియోజకవర్గం ఎలక్టోరల్ రిజిస్ట్రార్ లక్ష్మికుమారి, తాడేపల్లి మండల డిప్యూటీ తహశీల్దారు సతీష్, వడ్డేశ్వరం వీఆర్వో ఆషా, గుండిమెడ వీఆర్వో మల్లిఖార్జున రెడ్డి, వర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్ధసారథివర్మ, ప్రో వైస్ చాన్సలర్లు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, ఎన్.వెంకట్ రామ్, విద్యార్థి సంక్షేమ విభాగాధిపతి డాక్టర్ సిహెచ్ హనుమంతరావు, ప్రిన్సిపల్ డాక్టర్ టి.రామకృష్ణ, డీన్ సలహాదారులు డాక్టర్ హబీబుల్లా ఖాన్, డాక్టర్ కేఆర్ఎస్ ప్రసాద్, అసోసియేట్ డీన్ డాక్టర్ కె.రూత్ రమ్య, సాక్ డైరెక్టర్ సాయి విజయ్, ఎన్‌సీసీ లెఫ్టినెంట్ మౌనిక తదితరులు పాల్గొన్నారు.

మహారాజశ్రీ మంగళగిరి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జివారికోర్టులో

O.S.No: 121 /2021

బిట్వీన్:
రామినేని పూర్ణ చంద్రరావు@పూర్ణయ్య. - వాది

ఎదిరి

యెద్దూరి ప్రతిమ వగైరాలు - ప్రతివాదులు టు,

D-4: యెద్దూరి ఉమాదేవి, భర్త లక్ష్మయ్య, వయస్సు సం.61లు, హిందు, నివాసము, ఫ్లాటు నెం:206, తారకరామ ఎంక్లేవ్, తారకరామ నగర్ 6వలైను, ఎక్స్ టెన్షన్, ఆర్.టి.ఓ.ఆఫీసు దగ్గర, గుంటూరు సిటీ-522006.

పై నెంబరు దావాలో 4వ ప్రతివాది అయిన మీకు శ్రీ కోర్టు వారి ద్వారా సమన్సు/నోటీసులు పంపించినను మీరు తీసుకొనక కాలయాపన చేయుచున్నందున శ్రీ కోర్టు వారు మీకు **Substituted Service** ద్వారా పేపరు ప్రకటన ద్వారా తెలియజేయమని ఆర్డరు వేయగా సదరు ఆర్డరు ప్రకారం **ది:21-12-2023న ఉ.గం. 10-30 ని.లకు** పై తెలిపిన కోర్టునకు మీరు స్వయంగా కాని, మీ అడ్వకేటు ద్వారాగాని హాజరై మీ ఆక్షేపణలు తెలియపరచు కొనవలయును. లేని యెడల మీ పరోక్షమున విచారించి తీర్మానించబడును అని తెలియజేయడమైనది.

(శ్రీ కోర్టు వారి అనుమతితో)

వాయిదా తేది:21-12-2023

భట్రాజు కృష్ణ కిషోర్,
వాది తరపు అడ్వకేట్, గుంటూరు.,
సెల్: 9848560714

విశాలాంధ్ర
గుంటూరు జిల్లా

గంజి చిరంజీవికి అభినందనలు తెలిపిన పద్మశాలి సంఘం ప్రతినిధులు

విశాలాంధ్ర-మంగళగిరి : వైసీపీ మంగళగిరి నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా నియమితులైన గంజి చిరంజీవిని ఆయన నివాసానికి వెళ్ళి వైసీపీ నాయకులు, కార్యకర్తలతో పాటు పెద్ద సంఖ్యలో అభిమానులు శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు. గురువారం మంగళగిరి పట్టణ పద్మశాలి బహుతమ సంఘం వారు ప్రత్యేకంగా కలిసి అభినందించారు. పూలబొకేలు అందజేసి శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు మాట్లా డుతూ పద్మశాలి చేనేతలను గుర్తించి తమకు మంచి ప్రాధాన్యతనిస్తూ, మంగళగిరి నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా యువ నాయకుడు గంజి చిరంజీవికి ఎమ్మెల్యే టికెట్ ఇచ్చి గుర్తించినందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు చెప్పారు. 2024 ఎన్నికలలో మంగళగిరి చేనేతలు అందరం ఏకమై నియోజకవర్గ బీసీ సంఘాల్ని మొత్తాన్ని ఏకతాటిపై నడిపించి గంజి చిరంజీవిని మెజారిటీతో గెలిపించే బాధ్యత తీసుకుంటామని తెలిపారు. రాష్ట్రం మొత్తం ఉన్న చేనేత సంఘాలతో మాట్లాడి మంగళగిరిపై ప్రత్యేక శ్రద్ధ పెడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘ అధ్యక్షులు చింతక్రింది కనకయ్య, ప్రధాన కార్యదర్శి దామర్ల కుబేరశ్వమి, రామనాథం పూర్ణచందర్ రావు, గంజి రవీంద్రనాథ్, జొన్నాదుల బిక్షారావు, తిరువీదుల కిరణ్, బిట్రా భాస్కర్, గుండా మధు, జనం పాండురంగారావు తదితరులు పాల్గొన్నారు.

17న గుంటూరు జిల్లా చరిత్ర సంఘం వార్షికోత్సవం

విశాలాంధ్ర-గుంటూరు : గుంటూరు జిల్లా చరిత్ర సంఘం 29వ వార్షికోత్సవం ఈ నెల 17వ తేదీన ఉదయం 10 గంటలకు స్థానిక బ్రాడీపేటలోని శ్రీ మాజేటి గురవయ్య డిగ్రీ కళాశాల సమావేశ మందిరంలో జరుగుతుందని సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ప్రొఫెసర్ ఎస్.శామ్యూల్, డాక్టర్ మంచాల బోసు బాబు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రొఫెసర్ శామ్యూల్ అధ్యక్షతన జరిగే మొదటి సమావేశానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు, సంఘం పూర్వ అధ్యక్షులు డాక్టర్ మాజేటి సోమశేఖర్ రావు, గౌరవాధ్యక్షులు ఎన్వీ నరసింహారావు పాల్గొంటారని చెప్పారు. 'పాలస్తీనా స్వేచ్ఛ కోసం గళమెత్తుదామా' పుస్తకాన్ని ఆవిష్కరిస్తారన్నారు. రెండవ సమావేశానికి డాక్టర్ శ్రీనివాసరావు అధ్యక్షత వహిస్తారని 'పాలస్తీనా స్వేచ్ఛ కోసం గళమెత్తుదామా' పుస్తకంపై కేఎల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ బుడ్డిగా జమిందార్ సమీక్ష చేస్తారని చెప్పారు. మూడవ సమావేశం మంతెన వెంకటరాజు స్మారక ఉపన్యాసం చరిత్ర సంఘం ఉపాధ్యక్షులు వై.సుభాష్ చంద్రబోస్ అధ్యక్షతన జరుగనుండగా 'విద్యా వ్యవస్థలో చరిత్ర మార్పులు, వ్యాఖ్యానాలు' అంశంపై చరిత్ర సమీక్షకులు కొప్పర్తి వెంకట రమణమూర్తి సమీక్ష చేస్తారని చెప్పారు. సయ్యద్ అమీర్ అధ్యక్షతన జరిగే నాలుగవ సమావేశంలో 'భారత రాజ్యాంగం, లౌకికవాదం' అంశంపై ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ డాక్టర్ వి.అంజిరెడ్డి ప్రసంగిస్తారని తెలిపారు.

గ్రామీణ డాక్ సేవకుల సమ్మె

విశాలాంధ్ర, తెనాలి : కేంద్ర సంఘాల పిలుపు మేరకు ఆలిండియా గ్రామీణ డాక్ సేవక్స్ యూనియన్, నేషనల్ యూనియన్ ఆఫ్ గ్రామీణ డాక్‌సేవక్స్ తెనాలి డివిజన్ బ్రాంచి ఆధ్వర్యంలో గురువారం తెనాలి పోస్టల్ కార్యాలయం వద్ద సమ్మె చేశారు. ఉదయం కార్యాలయం ఎదుట నినాదాలు చేశారు. ఎ.ఐ.జి.డి. ఎస్.యు.కె. విజయబాబు, జి.అశోక్ కుమార్‌లు సమ్మె చేయాల్సిన ఆవశ్యకతను వివరించారు. యూనియన్ నాయకులు వెంకటేశ్వరరావు మాట్లాడుతూ 7 డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సివిల్ సర్వెంట్ హోదా వెంటనే యివ్వాలని, 6 గంటల పనిభారం తగ్గించాలని, 12,24,36 అదనపు సర్వీస్ ఇంక్రిమెంట్లు మంజూరు చేయాలని, గ్రూపు ఇన్సూరెన్స్ ఐదు లక్షల రూపాయలు పెంచాలని డిమాండ్లను వివరించారు.

ఎ.ఐ.టి.యు.సి.గుంటూరు జిల్లా ఉపాధ్యక్షులు గురుబ్రహ్మం మాట్లాడుతూ ఉద్యోగులు చేస్తున్న సమ్మెకు ఎ.ఐ.టి.యు.సి. తెనాలి డివిజన్ మద్దతు తెలుపుతున్నాయన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా కూడా ఎ.ఐ.టి.యు.సి. తమ సహకారం అందిస్తుందన్నారు. ఎ.ఐ.టి.యు.సి. సీనియర్ నాయకులు బొల్లిముంత కృష్ణ మాట్లాడుతూ తెనాలి డివిజన్‌లోని కార్మిక సంఘాలు తమ మద్దతు ప్రకటించాయన్నారు. భవిష్యత్‌లో తమ వెంట అన్ని సమ్మెల్లో సహకరిస్తామన్నారు. కార్యక్రమంలో పోస్టల్ నాయకులు డి.ఎస్.ఎన్., కా.తిరుమలరావు, కా.సాయిప్రసాద్, భాగ్యరాజు, యం.శివయ్య, పోతురాజు, విజయబాబు, రవిప్రసాద్, సత్యనారాయణలు సమ్మె చేయాల్సిన అవసరాన్ని సందేశాల ద్వారా వివరించారు. కార్మికులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పురపాలక సంఘ కార్యాలయము, తెనాలి

బహిరంగ వేలము నోటీసు

ఆర్.ఒ.సి.నెం.87/2022/ఎ1. **తేది. 11-12-2023**

తెనాలి పురపాలక సంఘ పరిధిలోని దిగువ తెలిపిన షాపు రూములకు సంబంధించి బహిరంగ వేలము నోటీసు ఈ క్రింద తెలియజేయబడిన విధముగా **ది. 20-12-2023 బుధవారము ఉదయం గం. 11.00లకు** పురపాలకసంఘ కార్యాలయము నందు మున్సిపల్ కమీషనరుగారిచే గాని లేక వారి అనుమతి పొందిన మరి ఏ ఇతర అధికారిచే గాని బహిరంగ వేలము నిర్వహించబడును.

వ. నెం.	వేలం నిర్వహణ అంశము పేరు	ప్రారంభ ధరావత్తు (రూ.)	దాఖలు చేయవలసిన సాల్వెన్సీ
1	డాక్టర్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ షాపు నెం.25 మరియు 26	10,000/-	1,00,000/-

వేలం పాటలో పాల్గొనదలచిన వారు ముందుగా పై ప్రకటించిన విధముగా ధరావత్తు సొమ్ము, సాల్వెన్సీ ధ్రువపత్రము మరియు ఇ.సి. ధ్రువపత్రములు ముందుగా దాఖలుచేసి వేలములో పాల్గొనవలెను. సాల్వెన్సీ ధ్రువపత్రము లేనివారు సాల్వెన్సీ మొత్తమును నగదు రూపములో పురపాలక సంఘమునకు చెల్లించి పాటలో పాల్గొన వచ్చును. వేలం తేదీలు మార్పు చేయు విషయములో కమీషనర్ గారికి పూర్తి అధికారము కలదు. ఇతర వివరములు కార్యాలయ పనివేళల యందు రెవిన్యూ సెక్షన్ నందు సంప్రదించి తెలుసుకొనవచ్చును.

కమిషనరు, తెనాలి పురపాలక సంఘము

यूनियन बैंक ऑफ इंडिया Union Bank of India

హైదరాబాద్ మెయిన్ బ్రాంచ్
సిద్ది అంబర్ బజార్, హైదరాబాద్-500012

[నిబంధన 8(1)] స్వాధీనత ప్రకటన (స్థిరాస్తి కొరకు)

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా హైదరాబాద్ మెయిన్ బ్రాంచ్ పిబి సం.1108-సి, సిద్ధిఅంబర్ బజార్, హైదరాబాద్-12 అధీకృత అధికారిగా దిగువ సంతకందారు సెక్యూరిటైజేషన్ అండ్ రికన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ (రెండవ) చట్టం, 2002 (యాక్ట్ 54 ఆఫ్ 2002) మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) నిబంధనలు, 2002, నిబంధన 3తో చదివే సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించి **శ్రీమతి యంపారల పద్మజ (రుణగ్రహీత) & శ్రీమతి గద్దిపాటి మంజుల (సహ-రుణగ్రహీత)** కు నోటీసులో ప్రస్తావించబడినట్లుగా **రూ.12,38,089.90/-** (పన్నెండు లక్షల ముప్పైఎనిమిది వేల ఎనభై తొమ్మిదిరూపాయల తొంభై పైసలు మాత్రమే)లను నోటీసు అందిన **60 రోజుల్లోగా** తిరిగి చెల్లించ వలసిందిగా పిలుపునిస్తూ **ది.26-06-2023 న డిమాండ్ నోటీసు** జారీ చేయడమైనది.

రుణగ్రహీత బకాయి మొత్తాన్ని తిరిగి చెల్లించడంలో విఫలమైనందున సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) నిబంధనలు 2002 యొక్క నిబంధన 8తో చదివే చట్టం యొక్క సెక్షన్ 13(4) కింద అతను/ఆమెకు సంక్రమించిన అధికారాలను వినియోగించి ఈ కింద వివరించబడిన ఆస్తిని దిగువ సంతకందారు **డిసెంబరు 13, 2023** న స్వాధీనం చేసుకున్నట్లు రుణగ్రహీత & సాధారణ ప్రజలకు ఇందుమూలంగా నోటీసు ఇవ్వడమైనది. ఈ ఆస్తితో ఎటువంటి లావాదేవీలు నిర్వహించరాదని, ఈ ఆస్తితో ఏదేని లావాదేవీలు **రూ.12,97,526.90/-**) పన్నెండు లక్షల తొంభై ఏడు వేల ఐదు వందల ఇరవై ఆరు రూపాయల తొంభై పైసలు మాత్రమే) మరియు దీనిపై వడ్డీ మొత్తానికి గాను **యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా** చార్జికి లోబడి వుంటాయని ప్రత్యేకించి రుణగ్రహీత(లు)ను, మరియు సాధారణ ప్రజలను ఇందుమూలంగా హెచ్చరించడమైనది.

హామీ పెట్టబడిన ఆస్తిని విడిపించుకోడానికి అందుబాటులో ఉన్న సమయానికి సంబంధించి చట్టంలోని సెక్షన్ 13(8) నిబంధనలను గమనించవలసిందిగా రుణగ్రహీతలను కోరడమైనది.

స్థిర ఆస్తి వివరాలు :

సీతానగరం, చిన్న ఆంజనేయ గుడి ఎదుట, తాడేపల్లి, గుంటూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్ నందు గ్రౌండ్ ఫ్లోర్ & మొదటి అంతస్తు కలిగి డోర్ నం.13-65/11 ఆధారంగా ఉన్న నివాసయోగ్యమైన ఇల్లు కలిగియున్న ఆస్తి యావత్తు. **హద్దులు:** ఉత్తరం: ప్రసన్నరాణి ఆస్తి, దక్షిణం: దారి, తూర్పు: ఎగ్జిక్యూటెంట్ యొక్క మిగిలిన ఆస్తి, పడమర: పంచాయతీ రోడ్డు.

తేదీ:13-12-2023, ప్రదేశం: హైదరాబాద్ సం/- అధీకృత అధికారి, యూనియన్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా

విశాలాంధ్ర పల్నాడు జిల్లా

బాధిత రైతాంగానికి నష్టపరిహారం చెల్లించాలి: ముప్పాళ్ల

విశాలాంధ్ర-నరసరావుపేట : రాష్ట్రంలో మిచౌంగ్ తుఫాను, కరువు బాధిత రైతాంగానికి వెంటనే నష్ట పరిహారం చెల్లించాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం నరసరావుపేటలో అఖిలపక్షాలు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో తుఫాన్ ధాటికి పంటలు నష్టపోయిన రైతాంగానికి నష్టపరి హారం చెల్లించాలని జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద నిర్వ హించిన ధర్నాలో ముప్పాళ్ల పాల్గొని మాట్లాడుతూ రాష్ట్రం లో మిచౌంగ్ తుఫాను వచ్చేనాటికి కరువు విలయ తాండం చేస్తున్నదని ఆనాటికి రాష్ట్రంలో సీపీఐతో పాటు వామపక్షాలు మిగిలిన అన్ని రాజకీయ పార్టీలు రాష్ట్రంలో 13 జిల్లాల్లో కరువు మండలాలుగా ప్రకటించాలని ఉద్య మిస్తున్న నేపథ్యంలో గోరుచుట్టుపై రోకటి పోటు వలె మిచౌంగ్ తుఫాన్ ధాటికి చేతికి అందివచ్చిన మెట్ట పంట లైన అపరాలు, ఉద్యాన పంటలు ఆరుతడి పంటలను నీట ముంచి పంట పొలాలను విధ్వంసం చేసిందని అన్నారు. రాష్ట్రంలో 13 జిల్లాలలో రైతాంగం మొత్తం పంటలు నష్టపోయి అల్లాడిపోతుంటే దున్నపోతు మీద వాన కురి సిన చందంగా రాష్ట్ర ప్రభుత్వం చేష్టలుడిగి చూస్తున్నదని ఆయన విమర్శించారు. రాష్ట్రవ్యాప్తంగా సీపీఐ, అఖిలపక్ష రాజకీయ పార్టీలను కలుపుకొని అన్ని జిల్లాలలో డిసెంబర్ 11న రౌండ్ టేబుల్ సమావేశాలు నిర్వహించి రాష్ట్రంలోని అన్ని జిల్లా కలెక్టరేట్ల వద్ద ఈ నెల 14వ తేదీన బాధిత రైతాంగానికి నష్టపరిహారం చెల్లించాలని ధర్నాలు నిర్వహించడం జరుగుతున్నదని ఆయన అన్నారు. ఈ పరిస్థితుల్లో రైతాంగాన్ని ఆదుకోవా ల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానికి ఉందని కుంటి సాకులు చెప్పి రైతులను ఆదుకుంటామని చెబుతూనే మరొకపక్క రాష్ట్రం సుభిక్షంగా ఉందని రైతులు సుఖంగా ఉన్నారని వైసీపీ నాయకులు చెబుతుంటే సిగ్గుగా ఉందని అన్నారు. ఒంటెత్తు పోకడలతో రాష్ట్రంలో అరాచక పాలన సాగుతోందని ప్రజల సమస్యలను ఎలుగెత్తిన వారిని వైసీపీ నాయకులు విమర్శిస్తూ అడ్డమైన కేసులు పెడుతూ జైళ్లకు పంపుతున్నారని రైతాంగం పెద్దఎత్తున పంటలు నష్టపోయి బాధలతో నలిగిపోతుంటే ప్రభుత్వం ఇంతవరకు కూడా రైతాంగానికి జరిగిన నష్టాన్ని అంచనా వేయుటకు తగిన ఏర్పాట్లు చేయలేదని రైతులు వాపోతున్నారని కావున వ్యవసాయ అధికారులు వెంటనే ఫీల్డ్‌లోకి నష్టపరిహారం వెంటనే రైతులకు అందే విధంగా కార్యాచరణ చేపట్టాలని కేంద్ర ప్రభుత్వం కూడా ఈ కరువు తుఫానులను జాతీయ విపత్తుగా ప్రకటించి వెంటనే రూ.1000 కోట్లను రాష్ట్రానికి కేటాయించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. టీడీపీ నరసరావుపేట ఇన్‌చార్జ్ నాయకులు డాక్టర్ చదలవాడ అరవింద బాబు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతాంగం తుఫానుల వల్ల నష్టపోయి అల్లాడుతుంటే తాడేపల్లి ప్యాలెస్‌లో తమాషాలు చూస్తున్నదని, ఈ ప్రభుత్వానికి రైతుల పట్ల ఏమాత్రం శ్రద్ధ లేదని రైతు నాయకుడిని అని చెప్పుకునే జగన్‌మోహన్ రెడ్డి రైతుల పట్ల ఇంత అహంకారం ప్రదర్శించడం దుర్మార్గమని విమర్శించారు. తెలంగాణలో అహంకారం ప్రదర్శించిన కేసీఆర్‌ను ఇంటికి పంపినట్లు జగన్‌మోహన్ రెడ్డిని కూడా మూడు మాసాల్లో జరగబోయే ఎన్నికల్లో ప్రజలు వైసీపీ ప్రభు త్వాన్ని బంగాళాఖాతంలో కలుపుతారని ఆయన అన్నారు. తెలుగు రైతు జిల్లా నాయకులు వీరారెడ్డి మాట్లాడుతూ జగన్‌మోహన్ రెడ్డి రాష్ట్రాన్ని రాజధాని లేని రాష్ట్రంగా మార్చాడని కొంతమంది వైసీపీ నాయకులు రాష్ట్రానికి రాజధాని లేకపోయినా పరవాలేదని అంటున్నారని విమర్శించారు. రైతాంగానికి జరిగిన నష్టానికి తగిన నష్టపరిహారం ఇవ్వకుండా కాలయాపన చేస్తే ఈ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉద్యమాలు నిర్వ హించి తగిన బుద్ధి చెబుతామని ఆయన ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ ధర్నాలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శులు షేక్ హుస్సేన్, కాసా రాంబా బు, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఉలవలపూడి రాము, అధ్యక్షులు తాళ్లూరి బాబు రావు, తెలుగుదేశం పార్టీ నాయకులు డాక్టర్ కడి యాల వెంకటేశ్వరరావు, కొల్లి బ్రహ్మయ్య, కొల్లి వెంకటే శ్వర్లు షేక్ షరీఫ్, పేరయ్య, హరి, సీపీఎం నాయకులు కామి నేని రామారావు, ఆంజనేయ నాయక్, జై భీమ్ భారత్ పార్టీ జిల్లా నాయకులు గోదా జాన్ పాల్, ఎంఐఎం జిల్లా నాయకులు షేక్ మస్తాన్ వలి, కరిముల్లా, పీడీఎం నాయకులు నల్లపాటి రామారావు, గిరిజన సమాఖ్య రాష్ట్ర నాయకులు వి.కోట నాయక్, కడియం కోటి సుబ్బారావు, సీపీఐ నాయకులు బూదాల శ్రీనివాసరావు, ఎన్.రామ సుబ్బాయమ్మ, ఏఐవైఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.సుబ్బా రావు, ఏఐవైఎఫ్ జిల్లా కన్వీనర్ షేక్ సుభాని, పేరూరు రామారావు, పిన్నబోయిన వెంకటేశ్వర్లు, ఎ.పవన్ కుమార్, సూర్య అప్పారావు, సోదాల సాంబయ్య, ఏఐటీయూసీ నాయకులు ఉప్పలపాటి రంగయ్య, పట్టణ కార్యదర్శి వైదన వెంకట్, రొడ్డా అంజిరెడ్డి, చౌటపల్లి నాగేశ్వరరావు, బొంతా నాగేశ్వరరావు, లక్షాధికారి కొండలు, దాసరి వరహాలు, కమ్యూనిస్టు పార్టీ నాయకులు షేక్ బుడే, టీడీపీ నాయకులు సురేష్, శీలు బాబురావు తదితరులు పాల్గొన్నారు. రైతాంగ సమస్యలు పరిష్కారం కావాలని చేస్తున్న ఈ పోరాటానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు, జనసేన నాయకులు, బీఎస్పీ నాయకులు సంపూర్ణ మద్దతును తెలియజేశారు. ధర్నా అనంతరం అఖిలపక్ష నేతలు అందరూ ర్యాలీగా జిల్లా కలెక్టర్ కార్యాలయం వరకు వెళ్లి జాయింట్ కలెక్టర్ శ్యాంప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు.

వాలంటీర్లు, గృహసారథుల సేవలు మరువలేనివి: ఎమ్మెల్యే

విశాలాంధ్ర-వినుకొండ: పట్టణంలోని బ్రహ్మానాయుడు కళ్యాణ మండపంలో శాసనసభ్యులు బొల్లా బ్రహ్మానాయుడు ఆధ్వర్యంలో గురువారం వినుకొండ నియోజక వర్గ స్థాయి వాలంటీర్లు, గృహసారథుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ముందుగా ఈపూరు మండలం లోని అన్ని సచివాలయాల వాలంటీర్లు, గృహసారథులు గ్రామ సచివాలయ కన్వీనర్‌తో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడుతూ వాలంటీర్ల చేసే సేవా కార్యక్రమాలు అనేకమని, కరోన సమయంలో వారి సేవలు వర్ణనాతీతమని అన్నారు. ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిలాగా వాలంటీర్లు వ్యవహరిస్తున్న తీరు పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఇలాగే రానున్న రోజుల్లో కూడా ప్రభుత్వం అందజేసే పథకాలు ప్రజలకు ఇంకా చేరువ చేసేందుకు ప్రయత్నం చేయాలని సూచించారు. అలాగే ప్రభుత్వ కార్యక్రమం అయిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో సహకారం అందించినందుకు ధన్యవాదాలు తెలియజేశారు. గృహ సారథులు కూడా ప్రభుత్వం, పార్టీ పట్ల ఎంతో కృషి చేస్తున్నారని తెలిపారు. రానున్న రోజుల్లో రాజకీయ అభివృద్ధికి ఈ గృహ సారథులకే ప్రాధాన్యత కల్పిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల స్థాయి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

తహశీల్దార్ కార్యాలయం తనిఖీ

విశాలాంధ్ర-దుర్గి : స్థానిక తహశీల్దార్ కార్యాలయాన్ని గురువారం గురజాల ఆర్డీఓ జీవీ రమాకాంత్ రెడ్డి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన తహశీల్దార్ జి.రమేష్ కుమార్‌తో రెవిన్యూ సమస్యలు, సేవలపై చర్చించారు. మ్యుటేషన్లు, కన్వర్షన్లు, రీసర్వే, నైంటీన్ నోటీసులు గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం కార్యాలయ రికార్డులు పరిశీలించారు. రీసర్వే గురించి సర్వే అసిస్టెంట్లను అడిగి తెలుసుకున్నారు. సకాలంలో రీసర్వే పూర్తి చేయాలని ఆదేశించారు. ఆయన వెంట డీఈఓ జయరావు ఉన్నారు.

ఆలయ పునర్నిర్మాణానికి విరాళం

విశాలాంధ్ర-వినుకొండ: కొండ మీద దేవాలయం అభివృద్ధి పున రుద్ధరణలో భాగంగా దాతలు యాదాల బాలయ్య, శ్రీమతి నిర్మల దంపతులు, కుటుంబ సభ్యులు రూ.లక్ష 116 గురువారం వినుకొండ పట్టణ అభివృద్ధి సేవా సంఘం వారికి అందజేశారు. ఈ కార్యక్రమంలో గౌరవాధ్యక్షులు పెండ్యాల వెంకట పుల్లారావు, చైర్ పర్సన్ పులిపాటి రామారావు, కార్యదర్శి జాజుల మాల్యాద్రి కోశాధికారి రెడ్డి నగేష్ బాబు చందోలు మల్లికార్జున రావు, సహాయ కార్యదర్శి దండు చెన్నయ్య, కన్నెగండ్ల అనంత కోటేశ్వరరావు, ఈసీ మెంబర్స్ మొలక రామ తులసి రెడ్డి, తేలకపల్లి వెంకటేశ్వర్లు, ఊట్ల సుబ్బారావు, బాణావతి గోవిందు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు బియ్యం పంపిణీ

విశాలాంధ్ర-వినుకొండ: గంగినేని చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు గంగినేని రాఘవ ఆధ్వర్యంలో నిరుపేద కుటుంబానికి ఆదరణలో భాగంగా గురువారం వినుకొండ పట్టణం కారంపూడి రోడ్డు నందు గల మాస్టిన్ కాలనీలో నివాసముంటున్న పేదరికంలో ఉన్న మరియదాసు కుటుంబానికి క్రిస్మస్ పండుగ సందర్భంగా నెల రోజులు సరిపడా బియ్యం, పచారి సరుకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ అధ్యక్షులు పఠాన్ ఆయుబ్ ఖాన్, సోమేపల్లి శ్రీనివాసరావు, గుత్త గోవిందయ్య, డ్రిల్ మాస్టర్ కాకుమాను రాజేష్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు నరిశేటి మద్దతు

విశాలాంధ్ర-సత్తెనపల్లి : అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆందోళనకు ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ సంఘీభావం తెలుపుతున్నదని న్యాయవాది ఐఏఎల్ నాయకులు నరిశేటి వేణుగోపాల్ తెలిపారు. సత్తెనపల్లి తాలూకా సెంటర్‌లో గురువారం జరిగిన ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో జరిగిన దీక్షా శిబిరాన్ని సందర్శించి సీపీఐ పల్నాడు జిల్లా కార్యవర్గ సభ్యుడు, ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, న్యాయవాది నరిశేటి వేణుగోపాల్ సంఘీభావం తెలిపారు. అంగన్‌వాడీల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని, ఇన్సూరెన్స్, సౌకర్యాన్ని కల్పించి, ప్రభుత్వ పథకాలు కూడా అంగన్‌వాడీలకు అందించాలన్నారు. తల్లి బిడ్డల సంక్షేమం కోసం అంగన్‌వాడీలు కంటికి రెప్పలా అనుక్షణం సేవలందిస్తున్నారనీ మహత్తర సేవలందిస్తున్న అంగన్‌వాడీలను దినసరి కూలీలుగా ఏపీ ప్రభుత్వం అవమానకరంగా చూస్తూ కనీసం వేతనాలు ఇవ్వకుండా వెట్టిచాకిరి చేపిస్తున్నారన్నారు. అంగన్‌వాడీల శ్రమకు గుర్తింపునిచ్చి గౌరవ ప్రదమైన వేతనాలు ఇవ్వాలని న్యాయవాది నరిశేటి వేణుగోపాల్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

పల్నాటి ఉత్సవాలలో ఫ్లెక్సీల ఘర్షణ

విశాలాంధ్ర-కారంపూడి: పల్నాటి ఉత్సవాలలో ఏర్పాటు చేసుకున్న రాజకీయ పార్టీ ఫ్లెక్సీల వద్ద ఘర్షణ వాతావరణం గురువారం ఏర్పడింది. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఆయా పార్టీలు బ్యానర్లను పోటాపోటీగా ఏర్పాటు చేశారు. వీర్లదేవాలయ ప్రాంగణం బయట పెట్టిన టిడిపి, వైసిపి, జనసేన పార్టీల బ్యానర్లపై ఉన్న వాక్యాలు ఘర్షణకు దారి తీసింది. దీంతో సీఐ దార్ల జయకుమార్ ఇరు పార్టీల నాయకులను సర్దిచెప్పి మూడు పార్టీల బ్యానర్లను తొలగించారు. ఘర్షణ వాతావరణం సర్దుమణిగింది.

కన్నమదాసు విగ్రహాన్ని ఆవిష్కరించిన పిన్నెల్లి

విశాలాంధ్ర-కారంపూడి: పల్నాటి వీరుడు కన్నమదాసు విగ్రహాన్ని మాచర్ల శాసనసభ్యులు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి గురువారం ఆవిష్కరించారు. పల్నాటి చరిత్రలో కన్నమదాసు ప్రత్యేకమైన స్థానాన్ని సంపాదించుకున్నారన్నారు. అనంతరం వీర్లదేవాలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు సుమారు 900 ఏళ్ల క్రితం సమసమాజ స్థాపనకై బ్రహ్మానాయుడు ప్రవేశపెట్టిన చాపకూడు సిద్ధాంతాన్ని పల్నాటి ఉత్సవాలలో నేటికి ఆచరిస్తుండటం అభినందనీయమన్నారు. వీర్ల దేవాలయ ప్రాంగణంలోని చాపకూడు మండపంలో అన్నదానాన్ని ప్రారంభించి ప్రజలకు, భక్తులకు భోజనాన్ని వడ్డించారు. అనంతరం పల్నాటి వీర్ల దేవాలయ పీఠాధిపతి తరుణ్ చెన్నకేశవ, గ్రామ పెద్దలతో కలిసి పిన్నెల్లి సహపంక్తి భోజనం చేశారు.

కిరాణా దుకాణంలో చోరీ

విశాలాంధ్ర-రెంటచింతల: డెట్ల స్తంభాల కూడలిలో గురువారం తెల్లవారు జామున కిరాణా దుకాణంలో చోరీ జరిగింది. ఘటనా వివరాలిలా వున్నాయి. నాళం లక్ష్మీనారాయణకు చెందిన మూసివేసి ఉన్న కిరాణా దురాణాన్ని గడ్డపారతో షట్టరు, తాళం పగులకొట్టారు. దుకాణంలోకి చొరబడి సుమారు రూ.35 వేలు విలువ కలిగిన సిగరెట్లు, రూ.15వేల నగదు తస్కరించారు. లక్ష్మీనారాయణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు పరిశీలిస్తున్నారు.

నెలలు నిండని పిల్లలకు కంటి పరీక్షలు

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : గర్భిణీ స్త్రీలు పురిటినొప్పులను భరించలేకపోవడం, ముహూర్తాల పేరుతో శస్త్ర చికిత్సలు చేయించుకోవడం కోసం తాపత్రయం పడటం బాధకరమని గుంటూరు ప్రభుత్వ సమగ్ర (జీజీహెచ్)ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్ అన్నారు. జీజీహెచ్‌లోని శుశ్రుత హాలులో 'జిల్లా బాలల సత్వర చికిత్స కేంద్రం' ఆధ్వర్యంలో నెలలు నిండకుండా పుట్టిన పిల్లలకు..బరువు తక్కువ పిల్లలకు గురువారం కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ నాగరికత పెరుగుతున్న సమాజంలో ముహూర్తం పెట్టుకుని పిల్లలకు జన్మనిచ్చేందుకు తల్లులు సిద్ధపడటం మంచిది కాదన్నారు. దీని వల్ల అనేక దుష్పరిణామాలు చోటు చేసుకుంటున్నాయని, ప్రకృతి పరంగా శిశువు జన్మిస్తేనే ఆ బిడ్డ ఆరోగ్యవంతంగా ఉంటారని ఆయన అన్నారు. సాధారణ శస్త్ర చికిత్సలు వల్ల శిశువులు ఆరోగ్యంగా పుడతారని, ఈ విషయాన్ని ప్రతి తల్లితండ్రులు గుర్తు పెట్టుకోవాలని సూచించారు. నెలలు నిండకుండా శిశువులు జన్మనిస్తే ఆరోగ్యవంతంగా ఉండటం కష్టమని, పుట్టిన పిల్లలు తల్లిదండ్రులు తగు జాగ్రత్తలు తీసుకుంటే ఆరోగ్యవంతంగా ఉంటారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సివిల్ సర్జన్ ఆర్ఎంఓ డాక్టర్ సతీష్ కుమార్, నర్సింగ్ సూపరింటెండెంట్ ఆశా సజని పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం జయప్రదం చేయండి

విశాలాంధ్ర-సత్తెనపల్లి రూరల్ : ఈ నెల 21వ తేదీన ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి 51వ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని నియోజకవర్గస్థాయి రక్తదాన శిబిరాన్ని భారీ స్థాయిలో నిర్వహిస్తున్నామని రాష్ట్ర జల వనరుల శాఖా మంత్రి అంబటి రాంబాబు వివరించారు. గురువారం ఆయన కార్యాలయంలో జరిగిన పట్టణ నాయకుల సన్నాహక సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సమావేశానికి పార్టీ పట్టణ కన్వీనర్ సహారా మౌలాలి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మంత్రి అంబటి మాట్లాడుతూ గత ఏడాది 836 మంది రక్తదానం చేశారని, ఈ ఏడాది 1000 మంది రక్తదానం చేసేలా ప్రోత్సహించాల్సిన బాధ్యత నాయకులపై ఉందన్నారు. సమిష్టిగా ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేసి ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డికి ఘనంగా జన్మదిన శుభాకాంక్షలు తెలియజేద్దామని పిలుపునిచ్చారు. విద్యార్థి, యువకులను, వైఎస్సార్‌సీపీ శ్రేణులను, నాయకులు చైతన్యం చేయాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ నాయకులు చల్లంచర్ల సాంబశివరావు, నియోజకవర్గ నాయకులు పక్కాల సూరిబాబు, మున్సిపల్ వైస్ చైర్మన్లు షేక్ నాగూర్ మీరాన్, రమావత్ కోటేశ్వరావు నాయక్, ఏఎంసీ చైర్మన్ పెండెం బాబురావు, మక్కెన అచ్చియ్య, పల్నాడు జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షులు అచ్యుత శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పూర్తి హామీల అమలు ఘనత జగన్‌దే

విశాలాంధ్ర-రెంటచింతల : గురువారం జెట్టిపాలెం, గోలి గ్రామాలలో ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలంటే ప్రభుత్వ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మండల పార్టీ అధ్యక్షుడు గొట్టం బ్రహ్మారెడ్డి మాట్లాడుతూ మానిఫెస్టోలో ఇచ్చిన హామీలలో 98 శాతం హామీలను అమలుచేసిన ఘనత ఒక్క జగనన్నకే దక్కుతుందని, ప్రతి గృహానికి లబ్ది చేకూరే విధంగా నవరత్నాలను తీసుకుని వచ్చి పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలను అమలుపరు స్తున్న ఏకైక ప్రభుత్వం జగనన్న ప్రభుత్వమని తెలిపారు. అనంతరం వలంటీర్లకు జగనన్న కిట్లను పంపిణీ చేశారు. సర్పంచ్‌లు మున్నా చంద్రశేఖర్, దావులూరి ఉదయకుమారి రమేష్, ఎంపీపీ దాసరి చౌడేశ్వరీ, మాజీ జడ్పీటీసీ నవులూరి భాస్కరరెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ పమ్మి సీతరామిరెడ్డి, పేర్ల ముత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇంధన పొదుపు ర్యాలీ

విశాలాంధ్ర-చిలకలూరిపేట : ఈ నెల 14 నుంచి 20వ తేది వరకు ఇంధన పొదుపు వారోత్సవాలలో భాగంగా గురువారం చిలకలూ రిపేటలో గుంటూరు టౌన్ 2 డివిజన్ ఎక్జిక్యూటివ్ ఇంజినీర్, సీహెచ్ రమేశ్, సీఆర్‌డీఏ సర్కిల్ ఎక్జిక్యూటివ్ టెక్నికల్ ఇంజనీర్ సిహెచ్ రాంభోట్లు, గణాంక అధికారి అజయ్ కుమార్, చిలకలూరిపేట డిప్యూటీ ఎక్జిక్యూటివ్ ఇంజినీర్ ఆర్.అశోక్ కుమార్, గుంటూరు టౌన్ 2 పరిధిలోని డిప్యూటీ ఎక్జిక్యూటివ్ ఇంజినీర్లు, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు విద్యుత్ సిబ్బందితో స్థానిక సుబ్బయ్యతోట సబ్ స్టేషన్ నుంచి విద్యుత్ సిబ్బందితో కలిసి ర్యాలీగా వెళ్ళి గడియార స్తంభం వద్ద మానవహారం నిర్వహించారు. వారు విద్యుత్ పొదుపుతో వాడుకుంటే భవిష్యత్‌తరాలకు ప్రగతి దానితో దేశ ప్రగతికి తోడ్పడుతుందని డివిజన్ ఎక్జిక్యూటివ్ ఇంజినీర్ రమేష్ తెలిపారు.

పేదల గొంతు కోస్తున్న జగన్ రెడ్డి

విశాలాంధ్ర-గుంటూరు : నా ఎస్సీలు, నా బీసీలు, నా మైనారిటీలు అని మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన జగన్‌మోహన్ రెడ్డి ఎస్సీలు, బీసీలు, మైనారిటీలను చంపటమే ధ్యేయంగా పెట్టుకొని వారు అభివృద్ధి చెందకుండా పాతాళానికి తొక్కేస్తున్నారని టీడీపీ నగర అధ్యక్షులు డేగల ప్రభాకర్ ఒక ప్రకటనలో విమర్శించారు. పైకి కార్పొరేషన్లు ఏర్పాటు చేసి వారిని కార్యాలయాలకు ఖాళీ ఖుర్చీలకు పరిమితం చేశారని అన్నారు. కల్లబొల్లి మాటలు చెబుతూ ప్రతిపక్ష నాయకులపై కక్ష తీర్చుకుంటున్నారని అన్నారు. రాష్ట్ర భవిష్యత్తు బాగుండాలంటే చంద్రబాబు మళ్లీ సీఎం కావాలని అన్నారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ గెలుపు అత్యవసరమని, సమసమాజాన్ని స్థాపించాలన్నదే టీడీపీ ధ్యేయమని అన్నారు.

చంద్రబాబును కలిసిన కొమ్మాలపాటి

విశాలాంధ్ర-పెదకూరపాడు: మాజీ ఎమ్మెల్యే కొమ్మలపాటి శ్రీధర్ గురు వారం మంగళగిరి టీడీపీ కార్యాలయంలో టీడీపీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడుని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గం లోని పలు విషయాలపై చంద్రబాబుతో చర్చించారు. కార్యచరణ, దిశా నిర్దేశం అధిష్టానం చెప్పేదాన్ని బట్టి ముందుకు నడుస్తానని శ్రీధర్ అన్నారు.

సీఎం సహాయ నిధి పేదలకు వరం : ఎమ్మెల్యే

విశాలాంధ్ర-మాచర్ల: సీఎం సహాయనిధి పేదలకు వరం లాంటిదని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. సీఎం సహాయనిధి నుండి మంజూరైన చెక్కులను గురువారం లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పీఆర్కే మాట్లాడుతూ పేదలకు మెరుగైన వైద్య సౌకర్యాన్ని అందించడమే సీఎం జగన్మోహన్ రెడ్డి లక్ష్యమని, పేదలకు వైద్యం భారం కాకూడదని సీఎం సహాయ నిధి నుండి వారికి ఆర్థిక సహాయం అందజేయడం జరుగుతుందన్నారు. ఈ క్రమంలోనే సొంత ఖర్చు లతో వైద్యం చేయించుకున్న 16 మందికి రూ.21,41000 ల చెక్కులను అందజేసినట్లు పేర్కొన్నారు.

మల్లెల రాజేష్‌నాయుడు ప్రత్యేక పూజలు

విశాలాంధ్ర-చిలకలూరిపేట : పట్టణంలోని ఆర్యవైశ్య కళ్యాణ మండపం ప్రాంగణంలో ఉన్న శ్రీ పద్మావతి గోదా సమేత శ్రీ కళ్యాణ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ చిలకలూరిపేట నియోజకవర్గ ఇన్‌ఛార్జి మల్లెల రాజేష్ నాయుడు గురువారం ప్రత్యేక పూజలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వేద పండితులు రాజేష్ నాయుడును శాలువాతో సత్కరించి ఆశీర్వచనాలు అందజేశారు. కళ్యాణమందిర సంఘం, ఆర్యవైశ్య సంఘ ప్రముఖులు మల్లెల రాజేష్ నాయుడుకు అభినందనలు తెలియజేశారు. అనంతరం మల్లెల రాజేష్ నాయుడు వారితో సమావేశమయ్యారు. కార్యక్రమంలో పొట్టి శ్రీరాములు, మునిసిపల్ వైస్ చైర్మన్ కొలిశెట్టి శ్రీనివాసరావు, ఆలపాటి వెంకట్రావు, ఆలపాటి కాలేషా, పెన్నా సాంబశివరావు, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ పెరుమాళ్ళ సత్యనారాయణ, కొలిశెట్టి సతీష్, కేవీఎస్ కృష్ణుడు, రాచమల్లు సూర్యం, గట్టా రమేష్, సామా శ్రీనివాసరావు, గ్రంధి శ్రీనివాసరావు, తులాబందుల మణిదీప్, రావికింది సాంబశివరావు, సామా లక్ష్మణ తదితరులు పాల్గొన్నారు.

నాదెండ్లలో: మండలంలోని చిరుమామిళ్ల గ్రామంలో ఉన్న సాయిబాబా దేవాలయంలో వైసీపీ చిలకలూరిపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ మల్లెల రాజేష్ నాయుడు గురువారం ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా నియమితులైన తరువాత మొట్టమొదటిసారిగా గ్రామానికి విచ్చేసిన మల్లెల రాజేష్ నాయుడుకు గ్రామ పెద్దలు, దేవాలయ కమిటీ సభ్యులు స్వాగతం పలికి సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా మల్లెల రాజేష్ నాయుడు గ్రామ పెద్దలతో సమావేశమై పలు అంశాలపై మాట్లాడారు. వైసీపీ నాయకులు సింగారెడ్డి కోటిరెడ్డి, నాదెండ్ల మండల పరిషత్ వైస్ చైర్మన్ పత్తి వెంకట్, నాదెండ్ల మండల జేసీఎస్ కన్వీనర్ అల్లడి రవికుమార్, గద్దె కోటేశ్వరరావు, జెట్టి బొల్లయ్య, లూర్దు రెడ్డి, వైసీపీ చిలకలూరిపేట పట్టణ అధ్యక్షులు బేరింగ్ మౌలాలి, ఎస్సీ నాయకులు బొంతా రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ ప్రభుత్వ అవినీతి అక్రమాలను ఎదుర్కొంటాం

విశాలాంధ్ర-వినుకొండ: అధికార వైసీపీ అవినీతి అక్రమాలపై పోరాటం చేయడంలో బీజేపీ ముందుంటుందని, ప్రజల తరఫున పోరాడేది బిజెపి మాత్రమేనని ఆ పార్టీ పల్నాడు జిల్లా ఇన్చార్జి టి.రామకృష్ణారెడ్డి అన్నారు. వారు పెట్టే పోలీస్ కేసులతో భయపడేది లేదని, అవినీతి అక్రమాలను దీటుగా ఎదుర్కొంటామని అన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాల అన్నింటికీ రాష్ట్ర ప్రభుత్వం తమ ఫోటోలు పేర్లు ముద్రించుకొని ప్రచారం చేసుకుంటున్నారని అన్నారు. ఇటీవల సంభవించిన అకాల తుఫానుకు నష్ట పరిహారంగా కేంద్ర ప్రభుత్వం 500 కోట్లు విడుదల చేసిందన్నారు. పట్టణంలోని బృందావన్ ఫంక్షన్ హాల్లో గురువారం బొల్లాపల్లి మండలం బిజెపి బూత్ కమిటీ సమావేశం జరిగింది. అనంతరం జరిగిన సమావేశంలో రామకృష్ణారెడ్డి మాట్లాడారు. రాష్ట్రంలో బిజెపికి అవకాశం ఇవ్వాలని ప్రజల వద్దకు వెళ్తున్నామని ప్రధాని మోడీ చేసిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను వివరిస్తున్నామని అన్నారు. ప్రధాని మోడీ అనేక సంక్షేమ కార్యక్రమాలు ప్రవేశపెట్టారని ఇటీవల విశ్వకర్మ యోజన పథకం ద్వారా చేతివృత్తుల వారికి ఉపాధి లభిస్తున్నట్లు చెప్పారు. ఈ పథకం ద్వారా 50 శాతం సబ్సిడీపై రుణాలు ఇస్తున్నట్లు వివరించారు. వినుకొండ నియోజకవర్గ పరిధిలోని బొల్లాపల్లి మండలంలో 60 బూత్‌లకు అధ్యక్షులను నియమించామని, అలాగే వినుకొండ పట్టణంలో 40 బూత్‌లకు కమిటీలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. పట్టణంలోని మార్కాపురం రోడ్లో గల డాలర్ సిటీ వెంచర్‌లో అక్రమాలు చోటుచేసు కున్నాయని అందులో ప్రభుత్వ సైన్డ్ భూములు ఉన్నాయని దానిపై అధికారులు దర్యాప్తు చేసి నిజాలను బయటపెట్టాలని ఆయన డిమాండ్ చేశారు. అనేక పథకాలకు కేంద్ర ప్రభుత్వం నిధులు ఇస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం స్టిక్కర్లు వేసుకుంటున్నారని చెప్పారు. సమావేశంలో బిజెపి జిల్లా సెక్రటరీ మేడం రమేష్, నియోజకవర్గ ఇన్ చార్జి యార్లగడ్డ లెనిన్ కుమార్, జిల్లా పార్టీ కార్యదర్శి సుజాత, గోరంట్ల సత్యనారాయణ, జిల్లా బిజెపి అధ్యక్షులు ఎండ్లూరి వీరయ్య, 5 మండల బిజెపి అంద్యక్షులు పాల్గొన్నారు.

ఆశా వర్కర్లకు ముప్పాళ్ల మద్దతు

విశాలాంధ్ర-నరసరావుపేట : ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కారం చేయాలని నరసరావుపేట గాంధీ పార్క్ వద్ద ధర్నా చేస్తున్న ఆశ వర్కర్లకు సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు మద్దతు తెలిపారు. పల్నాడు జిల్లాలో ఆశా వర్కర్ల సమస్యలు వెంటనే పరిష్కారం చేయాలని ఈ సందర్భంగా ముప్పాళ్ల డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఆశా వర్కర్లకు అనేక హామీలు ఇచ్చిందని హామీలను అమలు చేయడంలో పూర్తిగా వైఫల్యం చెందిందని అన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రతి 1000 మందికి 1 ఆశ వర్కర్‌ను నియమించాలని, ఫైవ్ జి ఫోన్ కల్పించాలని, టీవీ లేబర్ సి బకాయిలను వెంటనే విడుదల చేయాలని, రూ.10 లక్షల ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని, ప్రభుత్వ సెలవులు, మెడికల్ సెలవులు కల్పించాలని, సంక్షేమ పథకాలు అమలు చేయాలని, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ పల్నాడు జిల్లా కార్యదర్శి ఏ.మారుతి వరప్రసాద్, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శులు షేక్ హుస్సేన్, కాసా రాంబాబు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి డి.శివకుమారి, జిల్లా నాయకులు ఎస్కే సుభాని, ఉప్పలపాటి రంగయ్య, వైదిన వెంకట్ పాల్గొన్నారు.

యూఈసీడబ్ల్యూయూ రాష్ట్ర మహాసభలు విజయవంతం చేయండి

విశాలాంధ్ర-మాచర్ల : విద్యుత్ కాంట్రాక్టు కార్మికులను ఆదుకోవడంలో సీఎం జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం విఫలమైందని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.బాలకాశి అన్నారు. స్థానిక సీపీఐ కొమెర వీరాస్వామి భవన్‌లో గురువారం జరిగిన మాచర్ల డివిజన్ విద్యుత్ కార్మికుల సమీక్ష సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. బాలకాశి మాట్లాడుతూ సీఎం జగన్ ఎన్నికల ముందు పాదయాత్రలో కాంట్రాక్ట్ కార్మికులను ఉద్దేశించి ఇచ్చిన ఏ ఒక్క హామీ ఐదేళ్లు పూర్తి కావస్తున్నా అమలుకు నోచుకోలేదన్నారు. ఇప్పటికైనా కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులర్ చేయాలని, 2022 సంవత్సరం పీఆర్సీ ప్రకారం వేతనాలను, 2018 సంవత్సరం నుంచి ఇప్పటివరకు పెయిడ్ హాలిడేస్ బకాయిలను వెంటనే చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టేందుకు ఈ నెల 18న విజయవాడలో జరగనున్న యూనియన్ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేసేలా కార్మికులు, అభిమానులు, ప్రజాసంఘాల నాయకులు భారీగా తరలిరావాలని ఆయన కోరారు. అనంతరం ఏఐటీయూసీ పట్టణ కార్యదర్శి మిద్దెపోగు బాబురావు మాట్లాడుతూ కాంట్రాక్టు విద్యుత్తు కార్మికులు చేసే అన్ని పోరాటాలకు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పి.శ్రీనివాసరావు, డివిజన్ అధ్యక్షులు ఎం.బాలకృష్ణ, జిల్లా ఉపాధ్యక్షులు ఎస్.జాన్ కుమార్, రమణారెడ్డి, నాగుల్ మీరా, షేక్ గౌస్, రామచంద్రారావు, కార్మికులు పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేస్తేనే అభివృద్ధి

విశాలాంధ్ర-శావల్యాపురం : అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తేనే మండలం అభివృద్ధి పథంలో ఉంటుందని ఎంపీపీ ముండ్లమూరి సుహాసిని అనిల్ కుమార్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ ముండ్లమూరి సుహాసిని అనిల్ కుమార్ అధ్యక్షతన గురువారం మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా శాఖల పనితీరు, వారి శాఖలో ప్రగతి నివేదికలపై చర్చించారు. ఈ సందర్భంగా ఈపూరు మార్కెట్ యార్డు చైర్మన్ చుండూరి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రజలకు సంక్షేమ పథకాలను అందజేయటంలో అధికారులు, ప్రజాప్రతినిధులు పారదర్శకంగా వ్యవహరించాలని అన్నారు. విద్య వ్యవస్థలో జగన్‌మోహన్ రెడ్డి అనేక మార్పులు తీసుకొచ్చాడని, అలాగే నాడు నేడు ద్వారా కార్పొరేట్ స్థాయి వసతులను ఏర్పాటు చేసి విద్యార్థులకు పుస్తకాలు, దుస్తులు, బూట్లు, టయ్ అందజేస్తున్నారని తెలిపారు. కానీ ఇంకా ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు సంఖ్య పెరిగేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని తెలిపారు. ఎంపీపీ ముండ్లమూరి సుహాసిని అనిల్ కుమార్ మాట్లాడుతూ మిచౌంగ్ తుఫాన్‌తో నష్టపోయిన ప్రతి రైతుకు నష్టపరిహారం అందేలా వ్యవసాయ శాఖ అధికారులు చూడాలని తెలిపారు. గతంలో మాదిరిగా కాకుండా నష్టపరిహారం వెంటనే ఈ ప్రభుత్వం అందజేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు నంబూరి ప్రభావతి, చెన్నెంశెట్టి రంగారావు, ఎంపీడీవో పేరుమీన సీతారామయ్య, తహశీల్దార్ షేక్ జాన్ సైదులు తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలు వినియోగించుకోవాలి

విశాలాంధ్ర-దుర్గి : కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల ప్రయోజనాలను వినియోగించుకోవాలని బీజేపీ మండల అధ్యక్షుడు వెలిదండి శ్రీనివాసరావు కోరారు. గురువారం మండల పరిధిలోని ఎన్ఎన్ తండా, ముటుకూరు గ్రామాల్లో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ జీఎల్ఎన్ గుప్తా ఆధ్వర్యంలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 17 రకాల పథకాలు గురించి ప్రజలకు డిస్‌ప్లే స్క్రీన్ ద్వారా అవగాహన కల్పించారు. సంక్షేమ ఫలాలు అర్హులైన వారందరికీ అందించాలన్నదే సంకల్ప యాత్ర లక్ష్యమన్నారు. లబ్దిదారులు ఈ కార్యక్రమంలో పాల్గొని లబ్దిని తెలియజేశారు. అనంతరం సంకల్ప యాత్ర ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు నాసరయ్య, ఎంపీపీ యేచూరి సునీత సాయి శంకర్, సర్పంచ్‌లు గొంది నాసరయ్య, సుబ్రహ్మణ్యం పద్మాబాయ్, డాక్టర్ శివరామకృష్ణ, ఏపీఓ చినవెంకటేశ్వర్లు, ఏఓ అమీర్ రెడ్డి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ నాగేంద్రమ్మ, శివశంకర్, వెంకటరెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రేపు తెనాలిలో స్వరాలయ వేదిక రజతోత్సవాలు

విశాలాంధ్ర-తెనాలి : ప్రముఖ సినీనటి, నర్తకి మంజుభార్గవికి జీవన సాఫల్య పురస్కారం అందజేయనున్నారు. ఈ సందర్భంగా పత్రికా రంగం నుంచి సీనియర్ జర్నలిస్టు నిమ్మరాజుకు సత్కారం చేయనున్నారు. అలాగే వివిధ రంగాలలో సేవలు అందించిన విశేష వ్యక్తులకు కూడా తెనాలిలో జరిగే స్వరాలయ వేదిక వారినందరినీ సత్కరించనున్నట్లు స్వరాలయ వేదిక వ్యవస్థాపకులు లక్కరాజు వెల్లడించారు. ఈ నెల 16న సాయంత్రం ఐదు గంటలకు తెనాలి రామకృష్ణ కవి కళాక్షేత్రంలో స్వరాలయ వేదిక రజతోత్సవాలు జరుగనున్నయని సంస్థ వ్యవస్థాపక్షులు సాయిలక్కరాజు మీడియాకు తెలిపారు. తమ 500వ కార్యక్రమం సందర్భంగా ప్రముఖ సినీనటి, నర్తకి మంజు భార్గవికి 2023-జీవన సాఫల్య పురస్కారం ఇవ్వనున్నట్లు నిర్వాకులు తెలిపారు. అలాగే పత్రికా రంగంలో ఉంటూ విశిష్టమైన సేవలను సమాజానికి అందిస్తున్న సీనియర్ జర్నలిస్టు నిమ్మరాజు చలపతిరావును కూడా ఘనంగా సన్మానించనున్నారు. సంగీత రంగంలో చింతలపాటి మంజులత పురస్కారాలు అలాగే వివిధరంగాలకు చెందిన ఎం.సత్యవర్ధన్ లలిత, ఎం.సైదులు తదితరులు ఆత్మీయ పురస్కారాలను అందుకోబోతున్నారు. ఈ కార్యక్రమంలో లలిత సంగీతం భక్తి సంగీత కచేరీలు జానపద కూచిపూడి భరతనాట్య ప్రదర్శనలు, పద్య గానం, వచన కవిత్వం, తెలుగు గజల్ల వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు లక్కరాజు, సుబ్రహ్మణ్యం తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా స్థానిక శాసనసభ్యులు అన్నాబత్తుని శివ కుమార్, తెలుగు అకాడమీ చైర్‌పర్సన్ నందమూరి లక్ష్మీపార్వతి, మాజీ మంత్రి మండల బుద్ధ ప్రసాద్ తదితరులు హాజరుకానున్నారు.

నూతన భవనంకు శంకుస్థాపన

విశాలాంధ్ర - యద్దనపూడి : ఎస్సీ కాలనీలో బాపట్ల పార్ల మెంట్ సభ్యులు నందిగం సురేష్ కేంద్ర నిధులు నుండి 40 లక్షల రూపాయలతో మల్టీపర్పస్ కల్చరల్ సెంటర్ బిల్డింగ్‌కి నియోజకవర్గ వైస్సార్సీపీ ఎస్సీ సెల్ అధ్యక్షులు పాలెపోగు రాంబాబు ఆధ్వర్యంలో శంకుస్థాపన కార్యక్రమం చేశారు. ఈ కార్యక్రమం లో ఎంపీపీ పులగం రజినీ, ఎమ్మార్వో కే రవికుమార్, ఈ ఓ ఆర్ టి ,శ్రీనివాసరావు, మండల సీనియర్ నాయకులు చిలుకూరి కృష్ణయ్య, మున్నంగి బస్విరెడ్డి, తనుబొద్ది వీరారెడ్డి, పల్లెపోగు అన్నమ్మ, వైస్ ఎంపీపీ ఐమల శాంసన్, పర్చూరు నియోజకవర్గ సోషల్ మీడియా కన్వీనర్ మున్నంగి వీరయ్య, పోలూరు ఎంపీటీసీ షేక్ .ఖాసీం, ఏ ఈ లు, వివిధ గ్రామాల సర్పంచ్ లు మరియు ఎన్ఆర్ఈజీఎస్ ఏ పీ ఓ రమేష్ బాబు తదితరులున్నారు.

కొనసాగుతున్న భద్రతా వారోత్సవాలు

విశాలాంధ్ర - బల్లికురవ : గనులలో కార్మికులు పనిచేసే టప్పుడు ప్రమాదాలు జరగ కుండా ముందస్తు జాగ్రత్తలు ఎలా తీసుకోవాలో అవగాహన కల్పిస్తూ భద్రత వారోత్సవాలు నాలుగో రోజు కూడా కొనసాగాయి.మైనింగ్ అండ్ సేఫ్టీ అధికారులు సూచనల మేరకు అన్ని గ్రానైట్ క్వారీలలో కార్మికుల భద్రతపై ఎలాంటి చర్యలు చేపడుతున్నారు అనే దానిపై పరిశీలించి తగు సలహాలు సూచనలు అందించారు.టీం సభ్యులను రెండు బృందాలుగా ఏర్పాటు చేసి గురువారం మారం వెంకరెడ్డి,లక్ష్మీ గ్రానైట్ క్వారీలలో తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా క్వారీలలో రికార్డులు,పనిచేసే యంత్రాలు, కార్మికులు పనిచేసే ప్రదేశాలను పరిశీలించరు.గనులలో పనిచేసేట ప్పుడు ప్రమాదాలు నివారించడంతోపాటు పర్యావరణాన్ని రక్షించుకో వాల్సిన బాధ్యత అందరి పైన ఉందన్నారు.ఈ తనిఖీలలో టీం సభ్యులు సురేష్ బాబు,లీలారామ్,బ్రహ్మారెడ్డి,మునియ్య తదితరులు పాల్గొన్నారు.

ఇంధన పొదుపు భవిష్యత్తు తరాలకు మేలు

విశాలాంధ్ర - చీరాల రూరల్ : నేడు మనం చేసే ఇంధన పొదుపుతో భవి ష్యత్తు తరాలకు మేలు కలుగుతుందని చీరాల ఆర్ డీ ఓ సరోజిని అన్నారు. ఇంధన పొదుపు వారోత్సవాల్లో భాగంగా ఏపీసీపీడీసీఎల్ కార్యాలయం నుండి గడియారస్తంభం వరకు ర్యాలీ నిర్వహించారు. ఇంధన పొదుపు పై ఫ్లేకార్డులను ప్రదర్శిస్తూ, నినాదాలు చేస్తూ ర్యాలీ సాగింది. గడియార స్తంభం కూడలి వద్ద మానవ హారం నిర్మించి ఇంధన పొదుపు అవసరాన్ని ఎస్ ఈ కె వి సత్యనారాయణ వివరించారు. విద్యుత్ ను పొదుపుగా వాడుకుంటే భవిష్యత్తులో ఇబ్బందులు లేకుండా జీవనం సాగించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో డీఈ జాన్ థామస్, ఏడీఈలు టీ శ్రీనివాసరావు, శ్రీనివాసరావు, రమేష్ బాబు, విద్యుత్ సిబ్బంది, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

నేడు పారిశ్రామిక వేత్తలతో సమావేశం

విశాలాంధ్ర - చీరాల రూరల్ : చీరాల, ఇంకొల్లు బస్ స్టేషన్ ల పరిధిలో ఖాళీగా ఉన్న స్థలాలలో వ్యాపార నిర్వహణ నిమిత్తం చీరాల ఆర్ టీ సి డిపో కార్యాలయంలో డిసెంబర్ 15వ తేదీ ఉదయం 11 గంటలకు ఔత్సాహిక పారిశ్రామికవేత్తలతో సమావేశం నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ శ్యామల తెలిపారు. ఈ కార్యక్రమానికి బాపట్ల జిల్లా రవాణా శాఖ అధికారి వైవి రెడ్డి హాజరు అవుతారన్నారు. ఆసక్తి కల వ్యాపార వేత్తలు ఈ సమావేశానికి హాజరు కావాలని కోరారు.

తల్లీబిడ్డలను కాపాడిన పోలీసులు

విశాలాంధ్ర - చీరాల : జీవితమన్నాక సమస్యలు వస్తుంటాయి పోతుంటాయి సమస్యలకు పరిష్కారాలు వెతకాలి కానీ ఆత్మహత్యలు పరిష్కారం కాదని ఈపురు పాలెం ఎస్ఐ జనార్ధన్ అన్నారు. గురువారం చీరాల ఓడరేవు బీచ్ లో చీరాల వైకుంఠపురంకు చెందిన గుగ్గిలం పావని భర్త రంగారావు తన ఇద్దరు చిన్న పిల్లలు జి.లక్షిత్, జి.శర్విత్ సాయిలతో కుటుంబ కలహాల నేపథ్యంలో ఆత్మహత్య చేసుకొనేందుకు సముద్రం లోపలికి వెళుతుండగా గ్రహించిన ఓ వ్యక్తి పోలీసుల సహాయంతో వారిని రక్షించి ఈపురుపాలెం పోలీస్ స్టేషన్ కు తరలించారు. ఈపురుపాలెం ఎస్ఐ జనార్ధన్ ఆధ్వర్యంలో వారికి కౌన్సిలింగ్ చేసి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

అంగన్వాడీ ధర్నాకు టీడీపీ సంఘీభావం

విశాలాంధ్ర - చీరాల రూరల్ : తహశీల్దార్ కార్యాలయం వద్ద అంగన్వాడీ కార్మికులు చేస్తున్న ధర్నాకు చీరాల తెలుగుదేశం పార్టీ నాయకులు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా తెదేపా నాయకులు మాట్లాడుతూ అంగన్వాడీ కార్మికుల న్యాయపరమైన డిమాండ్లను ప్రభుత్వం నెరవేర్చాలని అన్నారు. డిమాండ్ల సాధన కోసం నిరసన వ్యక్తం చేస్తున్న అంగన్వాడి కార్మికులకు తమ మద్దతు ఉంటుందన్నారు. అనంతరం వారితో కలసి మోకాళ్ళ మీద నిలబడి నిరసన వ్యక్తం చేశారు. చీరాల పట్టణ తెదేపా అధ్యక్షులు గజవల్లి శ్రీనివాసరావు, మైనార్టీ సెల్ నాయకులు మొహిద్దిన్, మంగపతి, పులిపాటి శేఖర్, సింగిరేసు కాళిదాసు, సుబ్బలక్ష్మి, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్పస్వామి పడిపూజలో గాదె

విశాలాంధ్ర - కర్లపాలెం : మండలంలోని పాతనందాయ పాలెం గ్రామంలో జరిగిన ప్రత్యేక పూజల కార్యక్రమం లో వైసీపీ నాయకులు గాదె పాల్గొన్నారు. అత్యంత వైభవో పేతంగా జరిగిన అయ్యప్ప స్వామి పడిపూజ కార్యక్ర మంలో అయ్యప్పమాలదారుల తో స్వామివారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు గోవతోటి విజయ్,దేగల రవి రెడ్డి,మారుబోయిన శ్రీనివాస్ రెడ్డి,అగ్గి రాముడు, శివారెడ్డి,గ్రామ పెద్దలు, గాదె యువసేన పాల్గొన్నారు.

నేడు కలెక్టరేట్‌లో ఉద్యోగుల గ్రీవెన్స్ సెల్

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : ప్రభుత్వ ఉద్యోగుల గ్రీవెన్స్ సెల్ కార్యక్రమం ప్రతినెల మూడో శుక్రవారం కలెక్టరేట్లో జరుగుతుందని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కలెక్టరేట్ లో శుక్రవారం ఉదయం 12:00 గంటలకు ఉద్యోగుల గ్రీవెన్స్ సెల్ ప్రారంభమవుతుందన్నారు. ఉద్యోగులు ఎవరైనా ధైర్యంగా తమ సమస్యలు చెప్పుకోవచ్చన్నారు. గ్రీవెన్స్ సెల్ కు వెళ్లదలచిన ఉద్యోగులకు అధికారులు అనుమతులు ఇవ్వాలని, ఆటంక పరచరాదన్నారు. జిల్లా అధికారులంతా అందుబాటులో ఉండాలని ఆదేశించినట్లు తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాలలో పనిచేస్తున్న ఉద్యోగులంతా అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉద్యోగులకు తక్షణమే న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు.

రైతులకు తక్షణమే సాయం అందించాలి

- మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్
- సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా
- కలెక్టర్‌కు వినతిపత్రం అందజేత

విశాలాంధ్ర - బాపట్ల : మిచౌంగ్ తుఫాన్ ప్రభా వంతో రాష్ట్రంలో రైతులు, కౌలు రైతులు, కూలీలు తీవ్రంగా నష్టపోయారని తక్షణమే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సాయం అందించి ఆదుకోవాలని మాజీ ఎమ్మెల్సీ, సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యు లు జల్లి విల్సన్ కోరారు. సీపీఐ రాష్ట్ర సమితి పిలు పు మేరకు బాపట్ల కలెక్టరేట్ రోడ్‌లో బుధవారం ఉదయం సీపీఐ జిల్లా సమితి ఆధ్వర్యంలో చేప ట్టిన ధర్నాకు పెద్ద ఎత్తున రైతులు, కౌలు రైతులు, ప్రజా సంఘాల ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జల్లి విల్సన్ మాట్లాడుతూ వరదలతో చేతికి వచ్చిన పంట నిండా మునగడం విచారకమన్నారు. ప్రభుత్వం ప్రకటించినట్లు ధాన్యం ఎలా ఉన్నా మద్దతు ధరకే కొను గోలు చేయాలని కోరారు. మురుగు కాలువల్లో ఉన్న నీరు ప్రవహించని కారణంగా పంట పొలాలు ఇంకా నీటి లోనే ఉన్నాయన్నారు. మురుగు పారే సౌకర్యం లేకపో వటం వల్ల ఈ పరిస్థితి నెలకొందన్నారు. సాగునీటిని రైతులకు అందించే విషయంలో ప్రభుత్వానికి ఉన్న శ్రద్ధ మురుగు పారదలకు కూడా ఉండాలన్నారు. జిల్లాలో తుఫాను ప్రభావిత ప్రాంతాలను ప్రభుత్వం ముందస్తుగా గుర్తించి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించి పున రావాసం కల్పించటం హర్షణీయమన్నారు. కానీ తుఫాను వల్ల నష్టపోయిన రైతులను ఆదుకోవటంలో యంత్రాం గం త్వరితగతిన చర్యలు చేపట్టడం లేదన్నారు. జిల్లాలో ప్రధానంగా వరి, పొగాకు, మిర్చి, వేరుశనగ, అరటి, పసుపు వాణిజ్య పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయన్నారు. తుఫాను వల్ల రైతులతో పాటు కౌలు రైతులకు రెట్టింపు నష్టం జరిగిందన్నారు. మురుగు కాలువల్లో నీరు పారే సౌఖర్యాలను మెరుగుపరచాలన్నారు. తీవ్ర దు:ఖంతో ఉన్న రైతులను ప్రభుత్వం త్వరితగతిని గుర్తించి ఆర్థికసాయం అందించాలన్నారు. అదేవిధంగా కౌలు రైతులను ప్రత్యేకంగా గుర్తించాలని రాష్ట్రంలో నష్టపోయిన రైతులకు తక్షణమే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆర్థిక సాయం అందించాలని కోరారు. ప్రతి రైతుకు ఎకరాకు రూ. 50 వేల చొప్పున నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. సీపీఐ జిల్లా కార్యదర్శి తన్నీరు సింగరకొండ, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జేబీ శ్రీధర్, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బత్తుల శామ్యూల్, ఆల్ ఇండియా ఎస్సీ ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా నాయకులు పర్రె కోటయ్య, నల్లమడ రైతు సంఘం నాయకులు రిటైర్డ్ ప్రొఫెసర్ విజయ్ కుమార్, అంబేద్కర్ యువజన సంఘం నాయకులు గుదే రాజారావు, సీపీఐ జిల్లా నాయకుల కేఎల్‌డి ప్రసాద్, సీపీఐ చీరాల నియోజకవర్గ కార్యదర్శి చిరముల ప్రకాష్ బాబు పలువురు ధర్నాలో మాట్లాడారు. అనంతరం కలెక్టర్ రంజిత్‌బాషాకు ఎమ్మెల్సీ జల్లి విల్సన్, సీపీఐ నేతల బృందం వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా నాయకులు ముత్తిరెడ్డి శ్రీనివాస్, ఆంధ్రప్రదేశ్ మహిళా సమైక్య జిల్లా కన్వీనర్ జే.రత్నకుమారి,మామిడి బత్తుల అశోక్, ఏఐవైఎఫ్ జిల్లా నాయకులు డి.రాజారెడ్డి,ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు మామిడిబత్తుల గని, కందుల వినయ్ కుమార్,ఆటో యూనియన్ జిల్లా నాయకులు అంజి, కంచర్ల యేసు రత్నం, సీపీఐ నాయకులు చీదర్ల కొండయ్య,ఆనందరావు, మోటాన్ జాన్సన్ తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ ఇన్‌చార్జి ఎంపిక విషయంపై పునరాలోచన చేయాలి: కృష్ణచైతన్య

విశాలాంధ్ర-అద్దంకి; నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి ఎంపిక విషయంపై పునరాలోచన చేయాలని ముఖ్య మంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని కోరతానని శాప్‌నెట్ చైర్మన్ బాచిన కృష్ణచైతన్య అన్నారు. అద్దంకి నియోజకవ ర్గానికి వైసీపీ ఇన్‌చార్జిగా ఉన్న బాచిన కృష్ణచైతన్యను తొలగించి పాణెం హనిమిరెడ్డిని పార్టీ అధిష్టానం రెండు రోజుల క్రితం నియమించిన నేపథ్యంలో కృష్ణచైతన్య గురువారం స్థానిక వైసీపీ కార్యాలయంలో నియోజక వర్గంలోని ఐదు మండలాల పార్టీ నాయకులు, కార్య కర్తలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈసంద ర్భంగా కృష్ణచైతన్య మాట్లాడుతూ తాను నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్తగా బాధ్యతలు స్వీకరించినప్పటి నుండి పార్టీ అధిష్టానం సూచనలకు అనుగుణంగా అంద రినీ కలుపుకొని పోతూ పార్టీని బలోపేతం చేశానన్నారు అద్దంకి సీటు విషయంలో ముఖ్యమంత్రి జగన్‌పై తనకు పూర్తి విశ్వాసం ఉందన్నారు. అద్దంకి నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి ఎంపిక విషయంలో సీఎం పునరాలోచన చేయాలన్నారు. అద్దంకి నుంచి వైసీపీ తరపున పోటీచేసి గెలిచి ముఖ్యమంత్రికి కానుకగా ఇస్తానన్నారు. అద్దంకిలో గొట్టిపాటి రవికుమార్‌ను ఓడించడమే తన లక్ష్యమన్నారు. సమావేశంలో పాల్గొన్న అద్దంకి మాజీ ఎమ్మెల్యే వైసీపీ సీనియర్ నాయకులు బాచిన చెంచుగరటయ్య మాట్లా డుతూ అద్దంకి ఎల్లలు తెలయని వ్యక్తిని అద్దంకి వైసీపీ ఇన్‌చార్జిగా పంపడం బాధాకరమన్నారు. నిత్యం ప్రజ లలో ఉంటూ సేవలందించేవాడే నాయకుడు అన్నారు. పార్టీ నిర్ణయానికి కట్టుబడి నిబద్ధతో పనిచేయడం తమ కుటుంబానికి అలవాటన్నారు. ప్రజల అభిప్రాయాన్ని గౌరవించి కృష్ణచైతన్యను అభ్యర్థిగా ప్రకటిస్తారన్నారు. పదవులకోసం కాకుండా పార్టీ కోసం పనిచేశామన్నారు. చివరి నిమిషంలో అభ్యర్థుల సీట్లు మార్పులు జరిగిన సందర్భాలు ఎన్నో ఉన్నాయన్నారు. అభ్యర్థుల ఎంపికలో కులాల ప్రస్తావన తీసుకురావడం దురదృష్టకరమన్నారు. అద్దంకి నుంచి వైసీపీ తరపున కృష్ణచైతన్య పోటీచేస్తారన్నారు. సమావేశంలో నియోజకవర్గంలోని ఐదు మండలాలకు చెందిన వైసీపీ కన్వీనర్‌లు, సర్పంచ్‌లు, కౌన్సిలర్‌లు, వైసీపీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ధూళిపాళ్లకు నరేంద్రవర్మ శుభాకాంక్షలు

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : సంగం డైరీ చైర్మన్, పొన్నూరు మాజీ శాసనసభ్యులు ధూళిపాళ్ల నరేంద్రకుమార్ పుట్టినరోజు సందర్భంగా బాపట్ల టీడీపీ ఇంచార్జీ వేగేశన నరేంద్రవర్మ గురువారం పార్టీ నాయకులతో కలిసి ఆయన నివాసానికి వెళ్లి పుష్పగుచ్ఛం అందజేసి శు భాకాంక్షలు తెలిపారు. అయనతో పాటు జనసేన పార్టీ కోఆర్డినేటర్ నామన శివన్నారాయణ టీడీపీ పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి తాత జయప్రకాశ్ నారాయణ, నాయకులు దొప్పలపూడి రాజశేఖర్ తదితరులు ఉన్నారు.

అంగన్వాడీల సమస్యలు పట్టని వైసీపీ ప్రభుత్వం

విశాలాంధ్ర - బాపట్ల : అంగన్వాడీ సమస్యలను వైసీపీ ప్రభుత్వం విస్మరించిందని టీడీపీ ఇంచార్జీ వేగేశన నరేంద్రవర్మ విమర్శించారు. స్థానిక ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట చేస్తున్న అంగన్వాడీల డిమాండ్‌ల నిరసన కార్యక్రమంకు తెలుగుదేశం, జనసేన నాయకులతో కలసి మద్దతు తెలిపారు.ఈ సందర్భంగా నరేంద్ర వర్మ మాట్లాడుతూ అంగన్వాడీలకు కనీస వేతనం రూ.26 వేలు చేయాలన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యూటీ ఇవ్వాలని,రిటైర్మెంట్ బెనిఫిట్ 5 లక్షలు, వేతనంలో సగం పెన్షన్ ఇవ్వాలన్నారు. అంగన్వాడీలకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని వేతనంతో కూడిన మెడికల్ లీవ్ సౌకర్యం కల్పించాలన్నారు. 300 జనాభా దాటిన మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలని వర్కర్లతో సమానంగా వేతనాలు ఇచ్చి మినీ వర్కర్లకు ప్రమోషన్లు ఇవ్వాలన్నారు. అంగన్వాడీ విద్యను బలోపేతం చేసి పిల్లలకి యూనిఫామ్, అమ్మఒడి అమలు చేయాలన్నారు. వైఎస్సార్ సంపూర్ణ పోషణ మెనూ చార్జీలు పెంచి గ్యాసును ప్రభుత్వమే సరఫరా చేయాలని పెండింగ్‌లో ఉన్న టిఎ బిల్లులు వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాబోయే రోజుల్లో వైసీపీ అరాచక పాలనకు చరమ గీతం పాడుదాం అని పిలుపునిచ్చారు. జనసేన పార్టీ కోఆర్డినేటర్ నామన శివన్నారాయణ మాట్లాడుతూ సర్వీసులో ఉండి చనిపోయిన కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇచ్చి భీమా అమలు చేయాలన్నారు. ఉద్యోగ భద్రత కల్పించా లని, కనీస వేతనం చెల్లించాలని, పెన్షన్, పీఎఫ్, ఈఎస్ఐ, గ్రాట్యుటీ వంటివి అమలుచేయాలని నాలుగేళ్లుగా అంగన్వాడీ ఉద్యోగులు కోరుతున్నా జగన్ ప్రభుత్వం పెడచెవిన పెడుతోందన్నారు.పాల బకాయిలు కోట్లలో ఉన్నాయి టీఏ బిల్లులు ఇవ్వడంలేదు. ఒక్కో ఉద్యోగికి కనీసం రూ.5 వేల నుంచి రూ.10 వేల వరకు రావాల్సి ఉన్నా పట్టించుకోవడంలేదు. కేంద్రాల పర్యవేక్షణ పేరుతో వివిధ కమిటీలు, రాజకీయ నాయకులు అంగన్వాడీ సిబ్బందిని వేధిస్తూ అవమానాలకు గురిచేస్తున్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

అధిక దరఖాస్తులు ఇస్తే చర్యలు : కలెక్టర్

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : జిల్లాలో కొత్తగా ఓటర్ల చేర్పులు, తొలగింపుకు ఒకే వ్యక్తి అధికంగా దరఖాస్తులు ఇస్తే తీసుకోరని కలెక్టర్ పి.రంజిత్ బాషా అన్నారు. గురువారం స్థానిక కలెక్టరేట్‌లోని ఆయన ఛాంబర్ లో ఓటర్ల జాబితా ప్రచురించడానికి తీసుకోవలసిన చర్యలపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఓటర్లు నమోదు,తొలగింపుల కోసం బల్క్ అప్లికేషను ఇచ్చిన వారిపై కేసులు నమోదు చేయడంజరుగుతుందన్నారు. ఓటర్ల నమోదు, తొలగింపుల కొరకు ఎన్నికల కమిషన్ వెబ్ సైట్‌లో ఇ. ఆర్.ఓ.,బి.ఎల్.ఓల వద్ద నమోదు చేసుకోవచ్చునన్నారు.జిల్లాలో జనవరి 5న ఓటర్లు జాబితా ప్రచురించడం జరుగుతుందన్నారు. ఆ తరువాత కూడా ఓటర్ల నమోదు చేసుకోవచ్చునన్నారు.జిల్లాలో ఇ.వి.ఎం మిషన్స్ పై ఓటర్లుకు అవగాహన కల్పించడానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. జిల్లాలో ఇప్పటి వరకు ఓటర్లు నమోదు, తొలగింపులు,మార్పులకోసం 1,81,126 దరఖాస్తులు వచ్చాయన్నారు. విచారణ జరిపి 20,827 తిరస్కరించడం జరిగిందన్నారు. 1,31 లక్షల దరఖాస్తులు అనుమతించి ఓటర్లు జాబితాలోకి చేర్చడం జరుగుతుందన్నారు. 28,506 దరఖాస్తులు పెండింగులో ఉన్నాయన్నారు. త్వరలో పెండింగ్ అర్జీలు విచారణ జరిపి ఓటర్లు జాబితా ప్రచురించడానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ సమావేశంలో బీఎస్పీ నాయకులు ఎస్.భగత్ సింగ్ ,బీజేపీ నాయకులు కె.వి.రామకృష్ణ, సీపీఎం సి.హెచ్ గంగయ్య, కాంగ్రెస్ నాయకులు జి.రవి , టీడీపీ నాయకులు ఎస్.కె.సంజుద్దీన్, వైసీపీ నాయకులు మాల్యాద్రి ప్రతినిధులు ఎలక్షన్ సుపరిండెంట్ కృష్ణ కాంత్, పాల్గొన్నారు.

క్రీస్తు మార్గం ఆచరణీయం

విశాలాంధ్ర - చీరాల : క్రీస్తు చూపిన మార్గం అందరికీ ఆచరణీయమని ప్రజావేదిక ఐక్య క్రిస్టియన్ జేఏసీ వ్యవస్థాపకులు గుమ్మడి యేసురత్నం అన్నారు.బుధవారం రాత్రి పేరాల నోవాహు పేటలోని,నోవాహు ప్రార్థన మందిరంలో క్రిస్మస్ పండుగ సందర్భంగా మాజీ మంత్రి డాక్టర్ పాలేటి రామారావు ద్వారా ఏర్పాటు చేసిన చీరలను పేదలకు గుమ్మడి ఏసురత్నం ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గుమ్మడి ఏసురత్నం,ఐక్య క్రిస్టియన్ జేఏసీ బాపట్ల జిల్లా అధ్యక్షుడు గుమ్మడి రత్నప్రకాష్ లు మాట్లాడుతూ ఏసుక్రీస్తు చూపిన మార్గం శాంతి ,సమాధానం, పరులకు సహాయం చేయటమని అన్నారు. క్రీస్తు చూపిన బాటలో ప్రతి ఒక్కరు నడవవలసిన అవసరం ఉందని అలా నడిచినప్పుడే సమాజంలో ప్రతి ఒక్కరికి ప్రేమతత్వం ఏర్పడుతుందని అన్నారు. క్రీస్తు చూపిన మార్గంలో నడుస్తూ పేదలకు చీరలు పంపిణీ చేయడం మాజీ మంత్రి డాక్టర్ పాలేటి రామారావు దాతృత్వానికి నిదర్శనమన్నారు. ఈ కార్యక్రమానికి పాస్టర్ ఎం లుకయ్య అధ్యక్షత వహించి ప్రార్థన నిర్వహించారు. అనంతరం నూతన సంవత్సర క్యాలెండర్ను ఆవిష్కరించి పేదలకు చీరలు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో అధ్యక్షులు ఎంద్రపాటి శేఖర్ బాబు,పి తిరుపాలు,ఎట్రా మోజేష్ బాబు,ఒంటరి మనోహర్, చింతకుంట్ల యాకోబు, పలువురు సంఘ పెద్దలు,తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలి

విశాలాంధ్ర - రేపల్లె : అంగన్వాడీల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలి డిమాండ్ చేస్తూ తాలూకా కార్యాలయం వద్ద అంగనవాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిరవధిక సమ్మె గురువారం మూడవ రోజుకు చేరింది. సమ్మెలో భాగం గా అంగన్వాడి వర్కర్లు హెల్పర్లు మోకాళ్లపై నిలబడి వినూత్నంగా నిరసన తెలియజే శారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ రాష్ట్ర సమితి నాయకులు పి. నాగాంజనేయులు మాట్లాడుతూ మూడు రోజులుగా రాష్ట్ర వ్యాప్తంగా అంగనవాడీలు సమ్మె చేస్తుంటే ప్రభుత్వం నిమ్మకు నీరేత్తినట్లు వ్యవహరించటం, అధికారుల ద్వారా బెదిరింపులకు పాల్పడటం దుర్మార్గమ న్నారు. అధికార పార్టీ శాసనసభ్యులు అంగన్వాడీల పట్ల నోటికొచ్చినట్లు మాట్లాడటం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళనలు మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఏపీ చేతి వృత్తిదారుల సమైక్య రాష్ట్ర ఉపాధ్యక్షులు గొట్టుముక్కల బాలాజీ మాట్లాడుతూ పనిలేని అంగన్వాడీలు సమ్మె చేస్తు న్నారని శాసనసభ్యులు మాట్లాడిన తీరును ఖండించారు. అంగన్వాడీలకు కనీస వేతనం రూ. 26 వేలు అమలు చేయాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని, గ్రాడ్యుటి అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమస్యలను పరిష్కరించలేని ప్రభుత్వానికి అంగన్వాడీ కేంద్రాల తాళాలను బద్దలు కొట్టే అధికారం లేదని బాలాజీ ఆగ్రహం వ్యక్తం చేశారు.

జై భీమ్ భారత్ పార్టీ సంఘీభావం

అంగన్వాడీలు ఎదుర్కొంటున్నటువంటి సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని జై భీమ్ రావ్ భారత్ పార్టీ బాపట్ల జిల్లా అధ్యక్షులు న్యాయవాది దోవా రమేష్ రాంజీ డిమాండ్ చేశారు. తాలూకా కార్యాలయాల ప్రాంగణంలో ఏఐటీయూసీ, సీఐటీయూ సంఘాల ఆధ్వర్యంలో కొనసాగుతున్న దీక్షలకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగంలోని ఆర్టికల్ 45కి అనుగుణంగా కేంద్ర ప్రభుత్వం 50 సంవత్సరాల క్రితం ఏర్పాటు చేసినటువంటి సమగ్ర శిశు అభివృద్ధి సేవా పథకమును సమర్థవంతంగా అమలు చెయ్యటంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. అంగన్వాడీ వర్కర్లు హెల్పర్ల యొక్క సంక్షేమం ఆరోగ్యం ను విస్మరించి వారికి ఉద్యోగ భద్రత, రక్షణను కల్పిం చడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం చెందాయని ధ్వజమెత్తారు. అధికార పార్టీ 2019 ఎన్నికల్లో ప్రకటించిన విధంగా తెలంగాణ ప్రభుత్వం కన్నా ఎక్కువ జీతాలు అందిస్తామని హామీ ఇచ్చి నెరవేర్చ కుండా వేధింపులకు పాల్పడటం సిగ్గుచేటన్నారు. అంగన్వాడీల న్యాయమైన డిమాండ్ల సాధనకు జై భీమ్ రావ్ భారత్ పార్టీ కట్టుబడి ఉందని వారి తరపున ఉన్నత న్యాయస్థానాల్లో న్యాయ పోరాటం చేయడానికి సంసిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జై భీమ్ భారత్ పార్టీ నాయకులు కె. బాబురావు, వెంకట్రావు, పి. వెంకటేశ్వరరావు, యాకోబు, అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ బాపట్ల జిల్లా కన్వీనర్ జి. నాగమల్లేశ్వరమ్మ, కనకదుర్గ, పర్వీన్, శ్రీలేఖ, ఉమా, సునీత, వై. దుర్గ, అనూష, విజయ, వెంకటేశ్వరమ్మ, అనిత తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర
బాపట్ల జిల్లా

మూడో రోజుకు అంగన్వాడీల దీక్షలు

విశాలాంధ్ర - వేమూరు : అంగన్వాడీ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలంటూ చేపట్టిన నిరసన కార్యక్రమాలు గురు వారం నాటితో మూడో రోజు కు చేరాయి. మూడో రోజు వినూత్న రీతిలో మోకాళ్ళపై నిరసన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఎన్నికలకు ముందు అంగన్వాడీ వర్కర్లకు సముచితమైన గౌరవం అందిస్తామని వేతనాలు పెంచుతామని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ అందిని స్తామని హామీ ఇచ్చారన్నారు. గురువారం నిరసన దీక్షకు అగస్టీన్, తోకల వారి పాలెం సర్పంచ్, రాష్ట్ర సర్పంచ్ల సంఘం సభ్యులు కృష్ణమోహన్, ప్రొఫె సర్ విశ్వనాథ్‌లు తమ మద్దతు ప్రకటించారు. కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్ల సంఘం మండల అధ్యక్షురాలు బసమ్మ, కమిటీ సభ్యులు పద్మ, బుల్ల మ్మాయి, అమల, రెబ్బమ్మ, జయప్రద, దుర్గ, తిరుపతమ్మ, శైలజ పాల్గొన్నారు.

ఓట్ల తొలగింపుపై చర్యలు తీసుకోండి

విశాలాంధ్ర - మార్టూరు : మార్టూరులో స్థానికంగా నివాసం ఉంటున్నప్పటికీ ఓటర్ లిస్ట్ లో నుంచి తమ పేర్లు తొలగించడా నికి ప్రయత్నించి ఫామ్ - 7 ఉపయోగించినవ్యక్తులపై చర్యలు తీసుకోవాలని తాసిల్దార్ కె సుజాత ను కలిసి మార్టూరు చెందిన ఓటర్లు అర్జీని సమర్పించారు. వాటిపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటానని ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆమె హామీ ఇచ్చారు.

అనంతవరంలో ఫారం7 పై విచారణ

విశాలాంధ్ర - యద్దనపూడి : తెలుగుదేశం పార్టీ మద్దతుదారుల ఓట్లు తొలగింపే లక్ష్యంగా పదే పదే ఫారం 7 దరఖాస్తులు పెట్టిన ఓట్లపై అధికారులు అనంత వరం గ్రామంలో విచారణ చేప ట్టారు. 10 మంది వ్యక్తులు 317 మంది ఓటర్ల ఓట్లు తొలగించాలని అధికారులకు ఫారం 7 దరఖాస్తులు అందించారు.దరఖాస్తులు పెట్టిన 10 మంది గ్రామంలో అందుబాటు లో ఉన్న వారిలో ఐదుగురు దీనితో మాకు సంబంధం లేదని , మా పేరుపై ఎవరో దరఖాస్తులు ఇచ్చారని తేల్చి చెప్పారు.ఫారం 7 పెట్టి అభ్యంతరాలు వ్యక్తం చేసిన వారు అధికారుల వద్దకు రాలేదు. కానీ పోలీసులు మాత్రం ఉదయం నుంచే భారీగా మొహరించారు. ఓట్లు తీసివేయమని దరఖాస్తులు సమర్పించిన మరో ఐదుగురు మాకు సంబంధం లేదు అంటూ ముఖం చాటేశారు. ఎన్నిసార్లు ఇలా ఫారం 7లు పెట్టి మమ్మల్ని వేధిస్తున్నారని బాధితులు లబోదిబోమంటున్నారు. మా ఓట్లు తీసివేయమని దరఖాస్తులు ఇచ్చిన వారిని తీసుకువచ్చిన వారిపై విచారణ జరిపి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు.

మాజీ సైనికుల కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : మాజీ సైనికులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పా టు చేయాలని మాజీ సైనికుల సంక్షేమ సంఘం బాపట్ల జిల్లా అధ్యక్షుడు తాంద్ర సాంబశివరావు తెలిపారు. రాష్ట్ర అధ్యక్షుడు మోటూరి శంకరరావు అధ్యక్షతన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్థాయి మాజీ సైనికుల ఆత్మీయ సమ్మేళనం విజయవాడలో జరిగింది. మాజీ సైనికులు ఎదుర్కొంటున్న సమస్యలు రాష్ట్రంలోని మెజారిటీ యూనియన్‌ల ప్రతినిధులతో విస్తృతంగా చర్చించి, మాజీ సైనికులు అందరూ క్రమశిక్షణగా ఉంటూ ఐకమత్యంతో ఉండాలని చర్చించారు. తాంద్ర మాట్లాడుతూ దేశ రక్షణ కోసం తమ శరీర అవయవాలను కోల్పోవడమే కాకుండా తమ ప్రాణాలను సైతం తృణప్రాయంగా అర్పిస్తున్న మాజీ సైనికుల, మాజీ సైనికుల కుటుంబ సభ్యుల సమస్యలు త్వరిత గతిన పరిష్కరించాలి అంటే, మాజీ సైనికులకు ప్రత్యేకమైన కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ధరలతో 175 గజాల ఇళ్ళ స్థలాలను మాజీ సైనికులు కొనుగోలు చేసుకొనుటకు ప్రతిపాదించిన అంశాన్ని త్వరగా పరిశీలించి మాజీ సైనికుల కాలనీలు ఏర్పాటు చేసుకోవటానికి ప్రభుత్వం సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా మాజీ సైనిక సంక్షేమ సంఘం ఉపాధ్యక్షులు పుట్టా ఆది శేష రెడ్డి, సీనియర్ మాజీ సైనికులు సుంకర శేషగిరి రావు, తోట దుర్గా రావు, ముఖ్య సలహాదారులు అల్లావుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఐక్య క్రిస్మస్ వేడుకలు

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : పట్టణంలోని 8వ వార్డు అంబేద్కర్ నగర్‌లో యూత్ నాయకుడు చేగూడి మరియ దాస్ ఆధ్వర్యంలో ఐక్య క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. చిన్నారుల క్రిస్మస్ గీతాలు, క్రిస్మస్ సందేశం, క్యాండిల్ లైటింగ్ ఎంతో ఆకట్టుకుంది. పాస్టర్ చెల్లి అశోక్ చేసిన మ్యాజిక్ షో ప్రత్యేక ఆకర్షణగా నిలించింది. ఈ సందర్భంగా మరియదాస్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం డిసెంబర్ మాసంలో ఐక్య క్రిస్మస్ వేడుకలు యూత్ సభ్యులతో కలిసి నిర్వహి స్తున్నామని తెలిపారు. రాజమండ్రికి చెందిన అడిదల శామ్యూల్ వాక్యోపదేశం చేశారు.అంబేద్కర్ యూత్ ఆధ్వర్యంలో చిన్నారుల నృత్య ప్రదర్శనలు అలరించాయి. వైఎస్ఆర్సిపి పట్టణ అధ్యక్షులు కాగిత సుధీర్ బాబు క్రిస్మస్ వేడుకలు సందర్భంగా కేక్ కట్ చేసి ప్రజలందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. టపాసులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. సభాధ్యక్షులు కెప్టెన్ ఎం. ఆనంద కుమార్ వ్యవహరించారు. వైఎస్సార్ సీపీ నాయకులు చింతల రాజశేఖర్ జోగి రాజా, మద్దు శీనుబాబు, సంఘ పెద్దలు యూత్ ఉన్నారు.

చంద్రబాబుతోనే రాష్ట్ర అభివృద్ధి : వేగేశన

విశాలాంధ్ర - బాపట్ల : చంద్రబాబుతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని టీడీపీ ఇంచార్జీ వేగేశన నరేంద్రవర్మ తెలిపారు. ఇంటింటికి తెలుగుదేశం మీ మాటే - నా బాట,భవిష్యత్ కు గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా గురువారం పట్టణ లోని 9వ వార్డులో తెలుగుదేశం పార్టీ నాయకులతో కలసి వెళ్లి తెలుగుదేశం పార్టీ విధి విధానాలు వివరిస్తూ మహిళలకు ఇస్తు వారికీ చీర, నిత్యావసర వస్తువులు తెచ్చుకునే సంచి, తన గురించి తెలియజేసే కరపత్రాన్ని అందజేసి ఆశీర్వదించమని కోరారు. ఈ సందర్భంగా నరేంద్ర వర్మ మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాగానే, మినీ మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా, పథకాలు ప్రవేశపెట్టి, చంద్రబాబు నాయుడు రాష్ట్రాన్ని తిరిగి గాడిలో పెడతారని హామీ ఇచ్చారు. జగన్మోహన్ రెడ్డి చేతకాని పరిపాలనలో రాష్ట్రం సర్వనాశనమైనదని రాబోయే రోజుల్లో తెలుగుదేశం పార్టీ ని గెలిపించుకొని రాష్ట్ర అభివృద్ధి చేసుకుందామన్నారు.ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ,జనసేన పార్టీ నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.